


# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ




| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 156 | ది.22-9-2026 | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 156 | Date : 22-9-2026 | Tuesday | Pages : 8 | Rs.1/- |



## గోవా లోసోమన్న "అమ్మ ప్రేమ" పుస్తక పరిచయ సభ



**కర్నూలు,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** నందవరం మండల పరిధిలోని జడ్పీహెచ్ స్కూల్ నాగలదిన్నెలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న బాలబంధు గద్వాల సోమన్న రచించిన "అమ్మ ప్రేమ" పుస్తక పరిచయ సభ గావ్, గోవా, పనాజీ రాష్ట్రంలో ఘనంగా జరిగింది. డా. జయరావు, విశ్రాంత సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ గద్వాల ఆనంద్, ఎల్లరు జి. కేశన్న మరియు విశ్రాంత పోలీస్ ఆఫీసర్ ఆర్.రాజప్ప చేతుల మీదుగా మరియు విచ్చేసిన తెలుగు ప్రజలు సమక్షంలో ఆవిష్కరించి, పుస్తకాన్ని పరిచయం చేశారు.అనంతరం శతాధిక గ్రంథకర్త గద్వాల సోమన్నను సత్కరించారు. సన్మాన గ్రహీత, బాలగేయ బ్రహ్మ సోమన్నను శ్రేయోభిలాషులు, సాహితీ మిత్రులు అభినందించారు.

## మున్సిపల్ చైర్మన్ పదవికి అవకాశం కల్పించాలి

- టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధను కలిసిన మాజీ జడ్పీటీసీ గద్దె రమణ



**తిరువూరు,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మాజీ జడ్పీటీసీ సభ్యుడు గద్దె రమణ తన అనుచరులతో కలిసి టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధను ఆమె క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రానున్న తిరువూరు మున్సిపాలిటీ చైర్మన్ పదవి రిజర్వేషన్‌లో ఓసీ కేటగిరీకి అవకాశం లభిస్తే, తనకు చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించాలని గద్దె రమణ అనురాధను కోరినట్లు సమాచారం. తిరువూరు ప్రాంతంలో పార్టీ కోసం తాను, తన అనుచరులు చేస్తున్న కార్యక్రమాలను వివరించిన గద్దె రమణ, పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి అనుగుణంగా పనిచేస్తామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ అభ్యర్థుల ఎంపిక, స్థానిక రాజకీయ పరిస్థితులపై కూడా ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది.గద్దె రమణతో పాటు ఆయన అనుచరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. .

## పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు




**విస్సన్నపేట,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో సోమవారం జరిగిన మండల ప్రజా పరిషత్ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎంపీడీవో సిహెచ్ చిన్న రాట్నాలు డిప్యూటీ ఎంపీడీవోలు శివకుమార్ రామమోహన్ హౌసింగ్ ఏఈ సత్యనారాయణ పాల్గొన్నారు. రెవెన్యూ శాఖ పరిధిలో మండల తాసిల్దార్ కే లక్ష్మి కళ్యాణి విధులు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం లక్షలాది రూపాయల ఖర్చు పెట్టి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు జట్టు స్పీడ్ తో ముందుకు వెళుతున్న సమయంలో మండల స్థాయి అధికారులు అన్ని శాఖల నుండి హాజరు కాకపోవడం కొసమెరుపుగా చెప్పుకోవచ్చు.

## పాల రైతులకు సంక్షేమ పథకాలు అందించిన అర్జా నగేష్



**పెడన,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** పెడన మండలపరిధిలోని పాలు పాల కేంద్రాల్లో పాలు పోసిన రైతుల పిల్లలకు 20వేల రూపాయల విలువ గల గోల్డ్ కాయిన్స్ క్షీర బంధు పథకం కింద సోమవారం నాడు జిల్లా పాల సమితి డైరెక్టర్ అర్జా నగేష్ అందజేశారు. అలాగే 50 వేల రూపాయల చెక్కును కూడా అర్జా వెంకట నగేష్ చేతులమీదుగా పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గుడ్లవల్లేరు పాలసీతలీకరణ మేనేజర్ చిట్టూరి దామోదర కృష్ణ గోపీనాథ్ నందిగామ సంఘ అధ్యక్షులు జన్ను సీతయ్య నడుపూరు సంఘ అధ్యక్షులు చీరల కృష్ణ ఉప్పల కలవకుంటపాలెం అధ్యక్షులు రాజులపాటి రమేష్ బొర్రపోతుపాలెం సంఘ అధ్యక్షులు వి బి ఎన్ ఎస్ వి ప్రసాద్ పాల్గొన్నారు



ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం చంద్రగూడెం గ్రామ శివారు సబ్బపాడు గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలిపోతుందోనని గ్రామస్తులు భయపడుతున్నారు. ఓవర్ హెడ్ ట్యాంక్ పిల్లర్లలో పగుళ్లు వచ్చాయి.ఒక పిల్లర్ శిథిలావస్థకు చేరుకుంది. శిథిలమైన ఓవర్ హెడ్ ట్యాంక్ పిల్లర్లకు మరమ్మత్తులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.
-మైలవరం,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :

# వారాహి ఆలయాన్ని దేవాదాయ శాఖ మినహాయింపు ఇవ్వాలని ధర్నా

### డీసీ వ్యవహార శైలి పట్ల భక్తుల ఆవేదన





**కాకినాడ,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** కరప మండలం కొరిపెల్ల గ్రామం కరప – కాకినాడ ప్రధాన రహదారి పక్కన చిక్కాల వీర వెంకట సత్యనారాయణ (దొరబాబు) తన సొంత నిధులతో నిర్మించిన శ్రీశ్రీశ్రీ కాశీ వారాహి అమ్మవారి దేవాలయాన్ని దేవాదాయశాఖ స్వాధీనం తీసుకోవడం ఆపాలని కోరుతూ కాకినాడ సిటీ, రూరల్, పెదపూడి మండలాలకు చెందిన మహిళా భక్తులు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఒక అన్య మతస్తుడు ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుతో ఈ ఆలయాన్ని దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకోవడం తగదని వారు నినాదాలు చేశారు. దొరబాబు గత 26 ఏళ్ల నుండి తన సొంత నిధులతో తన సొంత గ్రామంలో ఆలయాలు నిర్మించి ఉత్సవాలు, వార్షికోత్సవాలు చేయడమే కాకుండా అన్న సమారాధనతో పాటు మహిళలకు పసుపు, కుంకుమ, చీరలు కూడా అందించారని వారు చెప్పారు. అన్య మతస్తులు ఇచ్చిన ఫిర్యాదు వెనుక ఎవరున్నారో విచారణ చేసి తిరిగి దొరబాబుకు ఆలయాన్ని అప్పగించాలని మహిళా భక్తులు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ లేకపోవడంతో వినతి పత్రం ఇచ్చేందుకు పిఠాపురంలో ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దగ్గరకు వెళ్లి ఇచ్చేందుకు మహిళా భక్తులు వెళుతున్న బస్సును పోలీసులు అడ్డుకొని పోలీస్ స్టేషన్'కు తరలించారు. దీంతో ఆ మహిళా భక్తులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసి దేవాదాయ శాఖ ఉప కమిషనర్ కార్యాలయానికి చేరుకొని శాఖ తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు పూర్తిస్థాయి బందోబస్తు పటిష్టం చేశారు. సమస్యను తెలియజేయడానికి దేవాదాయ శాఖ డిసి డివల్వ్ రమేష్ బాబు వద్దకు దొరబాబు ఇతర మహిళా భక్తులు వెళ్లగా వారిపై రమేష్ బాబు దురుసుగా సమాధానం ఇచ్చారని బయటకు వచ్చి మహిళా భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మహిళా భక్తుల చేత ధర్నా చేయించి ప్రజలకు ఇబ్బందులు కలిగించారనే నెపంతో చిక్కాల దొరబాబుపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

## గంజాయి రహిత కాకినాడ లక్ష్యంగా 'సివైఎఫ్' ఆవిర్భావం

- యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి




**కాకినాడ,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** యువతను సన్మార్గంలో నడిపించి, నగరంలో పెరుగుతున్న మాదకద్రవ్యాల మహమ్మారిని సమూలంగా నిర్మూలించాలనే సంకల్పంతో 'కోస్టల్ యూత్ ఫోర్స్' (సివైఎఫ్) అనే నూతన వేదిక ఆవిర్భవించింది. కాకినాడ రూరల్ మండలం తూరంగిలోని ఓ ఫంక్షన్ హాల్లో "హౌ టు లివ్ ఏ హెల్దీ లైఫ్" పేరిట ప్రత్యేక అవగాహన సదస్సు ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ వేదికగా గంజాయి నిర్మూలనే ధ్యేయంగా 'కోస్టల్ యూత్ ఫోర్స్'ను అధికారికంగా ప్రారంభించారు. తూరంగి మాజీ సర్పంచ్, సివైఎఫ్ గౌరవ అధ్యక్షుడు బలగం ప్రసన్నకుమార్, యువ నాయకులు అడ్డూరి హవ్యక్త, అడ్డూరి అభిషేక్'ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కాకినాడ సిటీ, రూరల్ పరిసర ప్రాంతాల నుంచి యువత పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు బలగం ప్రసన్నకుమార్ మాట్లాడుతూ కాకినాడలో ఒకప్పుడు చాలా ప్రశాంతంగా ఉండేదని ప్రస్తుతం యువత మాదకద్రవ్యాల అలవాట్లు చేసుకుని జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. తిరిగి ప్రశాంత కాకినాడగా తీసుకొచ్చేందుకు సివైఎఫ్ యువత పనిచేస్తుందన్నారు. గంజాయి ఇతర మాధక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని రాష్ట్రంలో అన్నిచోట్ల ప్రచారాలు చేస్తామని చెప్పారు. నాయకులు పాలెపు రవికుమార్, నాటి వినయ్, గరికిన వినయ్ తేజ, చెక్కా విష్ణు, అర్జున్, జేమ్స్ తదితరులు మాట్లాడుతూ ఒకప్పుడు రాష్ట్రంలోనే అత్యంత సురక్షితమైన నగరంగా, 'పెన్షనర్స్ ప్యారడైజ్'గా గుర్తింపు పొందిన కాకినాడలో నేడు గంజాయి, డ్రగ్స్ వినియోగం విపరీతంగా పెరిగిపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. మత్తు పదార్థాల ప్రభావంతో యుక్త వయసు వారు పెడదోవ పట్టి హత్యలు, చైన్ స్నాచింగ్‌లు వంటి తీవ్ర నేరాలకు పాల్పడుతున్నారని, దీంతో నగరంలో నేరాల రేటు పెరిగి ప్రజల్లో అభద్రతా భావం నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే చిన్నపాటి కారణాలకే టీనేజర్లు ఆత్మహత్యలకు పాల్పడటం బాధాకరమని, ఒత్తిడిలో ఉన్నవారిని సకాలంలో గుర్తించి కౌన్సెలింగ్ అందించాల్సిన బాధ్యత స్నేహితులు, సమాజంపై ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో మార్పు తీసుకొచ్చేందుకు 'కోస్టల్ యూత్ ఫోర్స్' వేదిక ద్వారా నగరంలోని ప్రతి వార్డులోనూ పర్యటించి మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పిస్తామని స్పష్టం చేశారు. యువతంతా ఐక్యంగా పోరాడి కాకినాడను తిరిగి పూర్వపు ప్రశాంతమైన, సురక్షితమైన, గంజాయి రహిత నగరంగా మార్చేందుకు నిరంతరం కృషి చేస్తామని వారు పునరుద్ఘాటించారు. అనంతరం సివైఎఫ్ లోగోను ఆవిష్కరించారు..

## ఎండోమెంట్స్ ఆధ్వర్యంలోని ఆలయాల్లో భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

### కలెక్టర్‌కు వి హెచ్ పి వినతి



**మచిలీపట్నం,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** ఎండోమెంట్స్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఆలయాల్లో భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించింది. వి హెచ్ పి ప్రతినిధులు ప్రశాంజనేయులు సుభాషిణి జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం దూళిపాళ రాము నిమ్మగడ్డ శ్రీధర్ తదితరులు కలెక్టర్‌ను కలిసి ఆలయాల్లో భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. జిల్లాలోని అనేక పురాతన చారిత్రక ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు మహిళలు, చిన్నారులు మరియు దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కోరారు ఆలయాలకు వచ్చే కానుకలు విరాళాలు మరియు ఇతర ఆదాయంలో తగిన భాగాన్ని ఆలయ నిర్వహణ పారిశుధ్యం మరియు భక్తుల సౌకర్యాల అభివృద్ధికి వినియోగించాలని వి హెచ్ పి సూచించింది. అదేవిధంగా ఆలయ భూములు భవనాలు మరియు ఇతర ఆస్తుల పరిరక్షణకు పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆస్తులు లీజులు మరియు ఆదాయ వివరాల్లో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరింది ప్రతి ఆలయంలోని మౌలిక సదుపాయాలపై ప్రత్యేక సర్వే నిర్వహించి, ఆలయం వారీగా అవసరమైన పనుల జాబితాను రూపొందించాలని వి హెచ్ పి కోరింది. భక్తుల రద్దీ ఆలయ ప్రాధాన్యత, ఆదాయం మరియు ప్రస్తుత సదుపాయాల పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి పనులను దశలవారీగా చేపట్టాలని సూచించింది. అలాగే ప్రతి ఎండోమెంట్స్ ఆలయానికి కనీస మౌలిక సదుపాయాల ప్రమాణాలను నిర్దేశించి, వాటి అమలును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేసింది. ప్రతినిధుల వినతిని కలెక్టర్ సానుకూలంగా స్వీకరించి ఆలయాల్లో భక్తుల సౌకర్యాల మెరుగుదలకు సంబంధించిన అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు ప్రతినిధులు వెల్లడించారు.

## "మయూరి" శ్యామ్ యాదవ్ దాతృత్వంతో బాలికలకు ఉచిత బ్లడ్ గ్రూప్ పరీక్షలు





**గూడూరు,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** శ్రీ కృష్ణ సేవా సమితి ఫౌండర్ చైర్మన్ మరియు తిరుపతి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బి. శ్యామసుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్) దాతృత్వంతో గూడూరులోని మహాత్మా జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాల నందు బ్లడ్ గ్రూపింగ్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా మేడం గారు, ఆర్.ఎం.ఓ. డాక్టర్ ప్రసూన మేడం , బ్లడ్ బ్యాంక్ ఇంచార్జ్ డాక్టర్ ప్రజ్ఞ మరియు బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సహకారంతో సుమారు 180 మంది బాలికలకు బ్లడ్ గ్రూప్ టెస్టింగ్ చేసి వారి బ్లడ్ గ్రూపులను తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అంజనమ్మ మాట్లాడుతూ, పిల్లలందరికీ ఉచితంగా బ్లడ్ గ్రూప్ టెస్టులు చేయించిన దాత డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ కి, అలాగే సహకరించిన ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా కి, ఆర్.ఎం.ఓ. ప్రసూన కి, బ్లడ్ బ్యాంక్ ఇంచార్జ్ ప్రజ్ఞ కి మరియు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ – "ఏదైనా అత్యవసర సమయంలో మీకు రక్తం అవసరమైనప్పుడు, అలాగే మీకు 18 సంవత్సరాలు దాటిన తర్వాత మీరు వేరే వాళ్లకు రక్తం ఇచ్చే సందర్భంలో మీ బ్లడ్ గ్రూప్ తెలిసి ఉంటే వెంటనే రక్తాన్ని అందించడానికి అవకాశం ఉంటుంది. బ్లడ్ గ్రూప్ తెలియకపోతే ముందు చెక్ చేసి ఆ తర్వాతే ఇవ్వాల్సి వస్తుంది. అందుకే ఈరోజు మీ అందరికీ బ్లడ్ గ్రూప్ టెస్టింగ్ చేసి తెలియజేయడం జరిగింది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అంజనమ్మ, బ్లడ్ బ్యాంక్ ల్యాబ్ టెక్నీషియన్లు మౌలాలి, బాబురావు, దిలీప్, ఆదిశేషయ్య, ఉపాధ్యాయునులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

## నందిగామ లో పోషణ మాసోత్సవం

**పెడన,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** ఈనెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన పోషణ మాసోత్సవంలో భాగంగా పెడన మండలం నందిగామ గ్రామంలో సోమవారం నాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిడిపిఓ సముద్రవేణి మాట్లాడుతూ తల్లులు పిల్లలకు కూడా పోషక ఆహారం అత్యవసరమన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల అనేక రుగ్మతలను నివారించ వచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పిట్ల కల్పవల్లి ఎ ఎన్ ఎం అంజలి ఉపాధ్యాయని లక్ష్మి కుమారి అంగన్వాడీ కార్యకర్తలు వెంకట్రావమ్మ కోటేశ్వరమ్మ విజయలక్ష్మి తల్లులు పాల్గొన్నారు.



## తెలుగు భాష ఉద్యమ నాయకుడు గురజాడ



**పెడన,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** పండితులు చేసే రచనలు వాడుక భాషలో అందరికీ అర్థమయ్యే విధముగా రచనలు చేసే మహాకవి రచయిత సంఘసంస్కర్త గురజాడ అప్పారావు అని ఏ.గౌరీ ప్రసాద్ తెలియచేశారు. స్థానిక విశ్వభారతి హైస్కూల్ నందు జరిగిన గురుజాడ అప్పారావు జయంతి వేడుకలలో భాగంగా సోమవారం నాడు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ సాంఘిక దురాచారాలను ఎదుర్కొంటానికి ఆయన రచించిన కన్యాశుల్కం నాటకం," దేశమును ప్రేమించుమన్నా" దేశభక్తి గీతం, ముత్యాలసరాలు గేయం ఎంతగానో ప్రసిద్ధిపొందయి. సెప్టెంబర్ 21 ఆయన జయంతి రాష్ట్ర పండుగగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయిని మట్టా లావణ్య పఠాన్ మౌలాబీ విద్యార్థులు పాల్గొన్నారు.

## గోకులంలో అలరించిన "రాజుబాబు" భక్తి గానం





**కాకినాడ,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** కాకినాడ గోకులం నందు శ్రీ విద్యా గణపతి ఆలయంలో ప్రముఖ ధార్మికవేత్త,ఎన్.సి.ఎస్ గ్రూప్ కంపెనీస్ చైర్మన్ నారాయణం మురళి, వారి హిమబిందు ల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా టి.వి మరియు ఆకాశవాణి గాయకులు కరక రాజుబాబు చే ప్రదర్శించబడిన "భక్తి సంగీత గీతాలాపన" కార్యక్రమాన్ని వీక్షించిన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఎంతో సంక్లిష్టమైన గీతాలను మనోహరంగా ఆలపించిన రాజుబాబు గానాన్ని పలువురు ప్రశంసించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు జిల్లా హెచ్.పి గ్యాస్ కంపెనీ అధినేత,రోటరీ సభ్యులు సీతాపతి రావు,సెల్డమ్ ఫార్మా కంపెనీ ఎమ్.డి ఎస్.వి.ఎస్.ఎన్.మూర్తి, గాయకులు రాజుబాబును అభినందిస్తూ, శ్రీమతి, శ్రీ నారాయణం మురళి దంపతుల ఆహ్వానం మేరకు దుశ్శాలువను కప్పి, ప్రశంసాపత్రాన్ని, నగదు పారితోషకాన్ని అందించి,తీర్థ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రఖ్యాత గోకులం ధార్మికవేత్త శ్రీ నారాయణం మురళి మరియు శ్రీమతి హిమబిందు దంపతులకు, కార్యక్రమ నిర్వాహకులకు రాజుబాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఉద్యమ బాటలో గ్రామ రెవిన్యూ సహాయకులు...



**గుడ్లవల్లేరు,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** మండలంలోని గ్రామ రెవిన్యూ సహాయకులు తమ కోర్కెలను తీర్చాలంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం బాటలో ఉన్నారు. గ్రామ రెవిన్యూ సహాయకుల సంఘ గుడ్లవల్లేరు మండల అధ్యక్షుడు ఉడుముల రవికుమార్ నాయకత్వాన ఈ సమ్మెను చేపట్టామని వీఆర్ఏలు తెలిపారు. తమ గౌరవ వేతనాన్ని రూ.10,500నుంచి రూ.21వేలకు పెంచాలన్నారు. అర్హులైన వీఆర్ఏలకు వీఆర్వోలుగా జీఓ నెంబర్ 13, సీనియార్టీ ప్రకారం ఇంటర్ విద్యార్హతతో పదోన్నతులు కల్పించాలని కోరారు. వద్ధాప్యంలో ఉన్న వీఆర్ఏల స్థానే వారి వారసులకు ఆ పదవుల్లో స్థానం కల్పించాలన్నారు. వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని కోరారు. నామినీగా పని చేస్తున్న వీఆర్ఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు.

## శ్రీ వేంకటేశ్వరుని సన్నిధిలో భక్తకోటి కోలాహలం...





**గుడ్లవల్లేరు,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** డోకిపర్రు మహాక్షేత్రంలోని శ్రీ భూసమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తకోటి అధికసంఖ్యలో పోటెత్తటంతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో స్వామివారికి చేపట్టిటన పూజల వల్ల పుణ్యఫలం అధికంగా లభిస్తుందని వేద పండితులు అన్నారు. స్వామివారి దర్శనంతో మనశ్శాంతి, కుటుంబ సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం కలుగుతాయని భక్తుల నమ్ముతున్నారు. ఉదయం తొలిపూజగా స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం పంచామతాలు, పాలు, జలాలతో స్వామివారికి విశేష అభిషేకం. విశేష పుష్పాలు, ఆభరణాలతో స్వామివారికి అలంకరణ, దీపారాధనతో పాటు విశేష నైవేద్యం సమర్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ పర్యవేక్షించారు.





# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ






| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 156 | ది.22-9-2026 | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 156 | Date : 22-9-2026 | Tuesday | Pages : 8 | Rs.1/- |


# ప్రకృతి సేద్యమే శ్రీరామరక్ష

- ప్రతి ఇంటినీ ఆర్థికంగా బలోపేతం చేస్తాం... కుప్పం అభివృద్ధికి కొత్తఊపు తెస్తాం
- కుప్పంలో రూ.327 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు భూమిపూజ, శంకుస్థాపనలు
- నీరు... పరిశ్రమలు... ఉపాధి... సౌర విద్యుత్... స్వర్ణ కుప్పం దిశగా సీఎం ప్రణాళిక







**కుప్పం,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** నారావారిపల్లె తనకు జన్మనిస్తే... కుప్పం రాజకీయ జీవితాన్ని ఇచ్చిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కుప్పాన్ని మోడల్ నియోజకవర్గం గా, స్వర్ణ కుప్పంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్తున్నామని తెలిపారు. గడచిన రెండేళ్లలో రెట్టింపు ఉత్సాహంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, కుప్పం నుంచే ఏ పని చేయాలన్నా నాంది పలుకుతామని చెప్పారు. కుప్పంలో సోమవారం వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రూ.327 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం భూమిపూజ, శంకుస్థాపనలు చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. హంద్రీనీవా కాలువ ద్వారా కుప్పానికి నీటిని తీసుకువచ్చి 133 చెరువులను నింపగలిగామని ముఖ్యమంత్రి తెలిపారు. కుప్పం నియోజకవర్గంలోని 550కుపైగా చిన్న నీటిపారుదల చెరువులను లిఫ్ట్ ఇరిగేషన్, పైప్‌లైన్లతో అనుసంధానం చేయనున్నట్లు చెప్పారు. యామిగానిపల్లి, మనపల్లి ప్రాంతాల్లో రిజర్వాయర్లు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని వెల్లడించారు. బీరువానిపల్లి వద్ద హంద్రీనీవా సుజల స్రవంతి కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా రూ.45 కోట్లతో రిజర్వాయర్ నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది రిజర్వాయర్లలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా, సద్వినియోగం చేసుకోవాలని సీఎం సూచించారు. పశుదాణాకు ఇబ్బంది లేకుండా కూడా కార్యాచరణ చేపట్టామని తెలిపారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని సీఎం తెలిపారు. కృష్ణా, గోదావరి నదులకు ఆశించిన స్థాయిలో నీరు రాకపోవడంతో నీటి లభ్యతపై ఒత్తిడి ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో రైతులు అధికంగా రసాయన ఎరువులు వినియోగించకుండా ప్రకృతి సేద్యం, ప్రత్యామ్నాయ పంటలు, సూక్ష్మ సాగునీటి విధానాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రకృతి సేద్యమే శ్రీరామరక్ష అనే విధానంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. సేంద్రీయ ఎరువుల వినియోగం, బయోచార్ వంటి విధానాలతో భూమిలో సారం, తేమ పెంచడంతో పాటు జీవవైవిధ్యాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 20 లక్షల మంది ప్రకృతి సేద్యం చేస్తున్నారని, ఈ సంఖ్యను మరింత పెంచాలని చెప్పారు. పీఎండీఎస్ విధానం ద్వారా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని, భూములను ఖాళీగా ఉంచకుండా సాగులోకి తీసుకురావాలని సూచించారు. తక్కువ నీటితో సాగయ్యే చిరుధాన్యాలతో పాటు పశుపోషణ, పౌల్ట్రీ, ఉద్యాన పంటలపై దృష్టి పెడితే రైతులు, మహిళలకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు.

**ప్రతి ఇంటిపైనా సోలార్ రూఫ్‌టాప్..** కుప్పాన్ని నెట్‌జీరో నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆస్పత్రులు, కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు సహా అన్ని భవనాలు నెట్‌జీరో దిశగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటిపైనా సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసి.. ప్రతి ఇల్లూ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మారేలా చర్యలు చేపడతామని చెప్పారు. వ్యవసాయ ఫీడర్ల కోసం 15 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన పీఎం-కుసుమ్ సోలార్ ప్రాజెక్టులను ముఖ్యమంత్రి ప్రారంభించారు. కుప్పంలో 8,904 బంగారు కుటుంబాలను గుర్తించి పీ4 కార్యక్రమం ద్వారా ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని సీఎం తెలిపారు. కుప్పాన్ని పేదరికం లేని నియోజకవర్గంగా మార్చడమే లక్ష్యమన్నారు. టీవీఎస్, అదానీ, మెగా తదితర సంస్థలు 8,900కుపైగా కుటుంబాలను దత్తత తీసుకుని వాటి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నాయని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త, ఒక స్టార్టప్ వ్యవస్థాపకుడు తయారవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కుప్పంలో ఇప్పటికే 32 పరిశ్రమలు ఏర్పాటయ్యాయని, వాటి ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం

- ప్రభుత్వ యంత్రాంగాన్ని అలెర్ట్ చేసిన హోంమంత్రి అనిత
- బుధ, గురువారాల్లో భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు ఆదేశాలు
- వంశధార, నాగావళి నదుల ప్రవాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- వాగులు, కాజ్‌వేల వద్ద ప్రత్యేక నిఘా -- ఎస్.డి.ఆర్.ఎఫ్., ఎన్.డి.ఆర్.ఎఫ్. బృందాలు సిద్ధంగా ఉంచాలి
- ప్రజలు ప్రభుత్వం జారీ చేసే అధికారిక సూచనలను పాటించాలి : హోంమంత్రి అనిత



**అమరావతి, సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రాబోయే రెండు రోజుల్లో తీవ్రవాయు గుండంగా బలపడి దక్షిణ ఒడిశా – ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఉన్నత స్థాయి అత్యవసర సమీక్ష నిర్వహించారు. ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్, ఇతర ఉన్నతాధికారులతో అత్యవసర టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన ముందస్తు భద్రతా చర్యలపై దిశానిర్దేశం చేశారు. తీవ్రవాయు గుండం ప్రభావంతో బుధ, గురువారాల్లో ఉత్తరాంధ్రలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హోంమంత్రి తెలిపారు. ఒడిశాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వంశధార, నాగావళి నదుల ప్రవాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలని హోంమంత్రి సూచించారు. ఒడిశా సరిహద్దు జిల్లాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేయాలని ఆదేశించారు. అత్యవసర సహాయక చర్యల కోసం ఎస్‌డిఆర్‌ఎఫ్ (SDRF), ఎన్‌డిఆర్‌ఎఫ్ (NDRF) బృందాలను సిద్ధంగా ఉంచాలన్నారు. రాష్ట్ర,జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లను 24 గంటలూ అందుబాటులో ఉంచి, క్షేత్రస్థాయి అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా నిత్యావసరాలు, వైద్యం,ఇతర అత్యవసర సదుపాయాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తీరప్రాంత, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అవసరమైతే వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలని స్పష్టం చేశారు. పొంగిపొర్లే వాగులు, ప్రమాదకరమైన కాజ్‌వేలు, ముంపు ప్రాంతాల వద్ద తప్పనిసరిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని హోంమంత్రి ఆదేశించారు. ప్రాణనష్టం జరగకుండా వాహనాలు, ప్రజల రాకపోకలను కట్టడి చేయాలని సూచించారు. ఈ తీవ్రవాయుగుండం ప్రభావంతో తీరం వెంబడి గంటకు 50 నుండి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి సూచించారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. చెట్లు, భారీ హోర్డింగ్స్, పాతబడిన/శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండరాదని సూచించారు. ప్రజలందరూ ప్రభుత్వం జారీ చేసే అధికారిక సూచనలను పాటిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# క్రీడల కోటా ఉపాధ్యాయులపై దాడులు సరికాదు: ఎమ్మెల్సీ డాక్టర్ గాదె



**విజయవాడ ,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** డీఎస్సీ-2025లో క్రీడల కోటాలో మెరిట్ ఆధారంగా ఎంపికైన ఉపాధ్యాయులను అవమానించేలా ప్రతిపక్షాలు చేస్తున్న రాజకీయాలను ఖండిస్తున్నట్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్రమాలు జరగలేదని చెబుతూ శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులపై దాడులకు దిగడం సరికాదన్నారు. రాష్ట్రంలో అత్యధిక డీఎస్సీలు నిర్వహించి, సాంకేతికతను అనుసరిస్తూ పారదర్శకంగా నియామకాలు చేపట్టి 14 డీఎస్సీల ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత చంద్రబాబు నాయుడు ప్రభుత్వానిదేనన్నారు. డీఎస్సీ-2025లో అవకతవకలు జరిగాయంటూ మొదట ప్రచారం చేసి, ఇప్పుడు క్రీడల కోటాలోనూ అక్రమాలు జరిగాయని తప్పుడు ప్రచారాలు చేయడం రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపిన క్రీడల కోటాలో ఎంపికైన ఉపాధ్యాయులపై దాడులు చేయడం సరికాదని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల అంశాల్లో రాజకీయాలు చేయకుండా చట్టసభల్లో తమ వాదనలు వినిపించాలని, సభా సమయాన్ని వృథా చేసి లేని తప్పులను ప్రభుత్వంపై రుద్దడం సరికాదన్నారు. ఇప్పటికైనా డీఎస్సీ-2025 అంశాన్ని పక్కనపెట్టి ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు దృష్టి సారించాలని డాక్టర్ గాదె కోరారు

**IN THE COURT OF THE I ADDL CIVIL JUDGE (JUNIOR DIVISION) AT VIJAYAWADA**

OS.NO : 267/2026

Between :

M/s Lakshmi Finance Reptd by its Prop V.Prabhu Kishore, Reptd by his G.P.A Holder, Gorrela Suresh

--------Plaintiff

AND

Kondeti Veeraiah and Another

--------Defendants

To

**ప్రతివాది No :- 1** Kondeti Veeraiah, S/o BabuRao, R/o Dr.No.43-106/1-14, R.R. Peta Road, Near Jayamma Eye Hospital, Singhnagar, Vijayawada, NTR District - 520015

**ప్రతివాది No :- 2** Chedipelli Dileep, S/o Ramu, R/o Dr.No.13-107, Tharakarama Nagar, Mylavaram Village and Manadal, NTR District - 521230

పై నెంబరు దావా ప్రోసిడింగ్స్‌లో ఒకటి మరియు రెండవ ప్రతివాదికి వాది పంపిన నోటీసులు అందుకోకపోవుటవలన పై తెలిపిన కోర్టు నందు ది.20-11-2026 ఉదయం గం.10.30ని॥లకు ప్రత్యక్షంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరు కావలెను. అట్లు కానిచో సదరు దావా ప్రోసిడింగ్స్ మీ పరోక్షమందు తీర్మానించగలరని ఇందుములముగా తెలియజేయడమైనది.

**(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)**

**వాయిదా తేది : 20-11-2026**

ఇట్లు

**శశి కుమార్**

వాది తరపు అడ్వకేట్

విజయవాడ

సెల్ : 7416516444

# అబద్దాలు, అసత్య ప్రచారాలతో జగన్ ఫేక్ డ్రామాలు

- ఏపీపీఎస్సీ పేపర్లను ప్లంబర్లు, ఎలక్ట్రీషిన్లతో దిద్దించిన జగన్ సిగ్గుపడాలి
- మెగా డీఎస్సీపై ఉద్దేశపూర్వకంగా జగన్ దుష్ప్రచారం
- మంత్రి కొలుసు పార్థసారధి



**ఆత్మకూరు, సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా, ఆత్మకూరులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న మంత్రివర్యులు కొలుసు పార్థసారధి ఈరోజు విజయవాడలోని శాప్ కార్యాలయంపై వైసీపీ సైకోలు చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా 16,500టీచర్ పోస్టులను తొలిసంతకం ద్వారా ఇస్తే దాని గురించి జగన్ మర్చిపోయాడన్నారు. మెగా డీఎస్సీలో స్పోర్ట్స్ కోటాలో 3శాతం ఉద్యోగాలు క్రీడాకారులకు ఇస్తే దానిపై లేనిపోని ఆరోపణలు చేసి ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నాడన్నారు. ఈరోజు విజయవాడ శాప్ కార్యాలయంపై కోడిగుడ్లు, రాళ్లతో దాడులు చేయించి అల్లర్లు సృష్టించడానికి జగన్ ప్రయత్నించాడు. వైసీపీ అధికారంలో ఉండగా ఏపీపీఎస్సీ పేపర్లను ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు హాయ్ ల్యాండ్ రిసార్ట్ లో దిద్దారు. ఈ విషయాన్ని జగన్మోహన్ రెడ్డి మరచిపోయారా? పోలీసులు, సంబంధిత అధికారులు లేకుండా ఏపీపీఎస్సీ పేపర్లు దిద్దడంపై కోర్టులు జగన్మోహన్ రెడ్డికి మొట్టికాయలు వేసింది. దానికి సిగ్గుపడకుండా ఉద్దేశపూర్వకంగా మెగా డీఎస్సీపై బురదజిమ్ముతున్నాడన్నారు. సొంత ఛానల్, పత్రికలు ఉన్నాయని గంటల తరబడి అబద్దాలు ప్రచారం చేస్తున్నాడు. జగన్మోహన్ రెడ్డికి నిజంగా ప్రజల సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి ఎందుకు రావడం లేదు? జగన్ తన పాలనలో చేసిన దుర్మార్గాలు బయటపడతాయనే భయంతో అసెంబ్లీకి రావడం లేదు. తాజాగా వైసీపీ ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ స్కాములో రూ.3,200కోట్లు దోచేసినట్లు సిట్ నివేదికలో తేటతెల్లమైంది. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విషయాల్లో వాస్తవాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఈ విషయాలన్నీ ప్రజలకు అర్థం కాకుండా ఉండేందుకు జగన్మోహన్ రెడ్డి మెగా డీఎస్సీపై ఉద్దేశపూర్వక విమర్శలు, దాడులు చేస్తున్నాడని మంత్రి కొలుసు పార్థసారధి జగన్మోహన్ రెడ్డిపై నిప్పులు చెరిగారు.




# వి.బి.ఆర్. విద్యాసంస్థల్లో ఘనంగా అంతర్జాతీయ మైక్రోబయాలజీ దినోత్సవం






**తిరుపతి,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** రేణిగుంట సమీపంలోని వి.బి.ఆర్. ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మైక్రోబయాలజీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వి.బి.ఆర్. ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ వేల్పుల విజయ భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో మైక్రోబయాలజీకి ఎంతో ప్రాధాన్యత ఉందని తెలిపారు. సూక్ష్మ జీవులపై అధ్యయనం ద్వారా వైద్య, ఔషధ, వ్యవసాయ, ఆహార, పర్యావరణ తదితర రంగాల్లో అనేక ప్రయోజనాలు చేకూరుతున్నాయని వివరించారు. మానవ ఆరోగ్య పరిరక్షణలో సూక్ష్మజీవుల పాత్రతో పాటు, వ్యాధుల నిర్ధారణ, నివారణ, చికిత్సలో మైక్రోబయాలజీ పరిశోధనలు కీలకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.విద్యార్థులు మైక్రోబయాలజీపై ఆసక్తిని పెంపొందించుకుని, శాస్త్రీయ దృక్పథంతో అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. ప్రయోగశాలల్లో నిర్వహించే పరిశోధనలు భవిష్యత్‌లో సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలకు దోహదపడతాయని అన్నారు. సూక్ష్మజీవులపై అవగాహన పెంచుకోవడం ద్వారా ఆరోగ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై కూడా విద్యార్థుల్లో బాధ్యత పెరుగుతుందని తెలిపారు.అంతర్జాతీయ మైక్రోబయాలజీ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మైక్రోబయాలజీ ప్రాధాన్యత, దాని అనువర్తనాలు, భవిష్యత్‌లో ఈ రంగంలో ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**CHAGE OF NAME**

I, SHAIK KHUDEESHIYA (Old Name), W/o. SHAIK SYED SHA MEERAVALI, R/o. D.No. 12-23/1,Post office street,Kondapalli Village, Ibrahimpatnam Mandal, NTR District – 521228, Andhra Pradesh. I have Changed My Name as **MOHAMMAD KHUDEESHIYA** ( New Name ), W/o.SHAIK SYED SHA MEERAVALI. Hereafter my name is known as **MOHAMMAD KHUDEESHIYA .**

# సంపాదకీయం

## మోడీ మీద రాహుల్ స్ట్రాటజీ బూమరాంగ్ ?

ప్రధాని నరేంద్ర మోడీని ఈ రోజు దేశమే కాదు ప్రపంచం కూడా గౌరవిస్తోంది. ఇటీవల ఢిల్లీ వేదికగా రెండు రోజుల పాటు నిర్వహించిన బ్రిక్స్ సక్సెస్ మీద విదేశీ మీడియావే ఎలుగెత్తి చాటింది. ఇక దేశంలో మోడీ బలమైన నాయకుడిగా ఆవిష్కరించబడ్డారు. బీజేపీలోనూ ఆయన తిరుగులేని ఆధిపత్యంతో కొనసాగుతున్నారు. ఎవరు కాదన్నా మోడీ చరిష్మా అయితే పటిష్టంగానే ఉంది. మోడీకి సరిసాటి నాయకులు ప్రత్యర్థి శిబిరంలో లేకపోవడం కూడా ఆయన విజయ పరంపర కొనసాగడానికి మరో ప్రధాన కారణంగా ఉంది అన్న విశ్లేషణలు ఉన్నాయి. ఇవన్నీ పక్కన పెడితే కాంగ్రెస్ ఒంటరిగా మోడీని బీజేపీని ఢీ కొనలేకపోతోంది అన్నది తెలిసిందే. కాంగ్రెస్ కి చివరి సారిగా 1984 లో సొంతంగా మెజారిటీ వచ్చింది. ఇక 200 ఎంపీల మార్క్ ని 1991, 2004, 2009లో మాత్రమే సాధించింది. మిగిలిన అన్ని సందర్భాల్లో ఆ లోపే ఆగిపోయింది. బీజేపీ అంతకంతకు : బీజేపీ విషయం తీసుకుంటే తన బలాన్ని అంతకంతకు పెంచుకుంటూ వచ్చింది. 2014, 2019లలో సొంతంగా మెజారిటీ సాధించింది. 2024లో కూడా సొంతంగా 240 సీట్లు బీజేపీకి వచ్చిన సంగతి మరచిపోరాదు. 2029 లో సైతం బీజేపీ సొంతంగా మ్యాజిక్ ఫిగర్ ని సాధించడానికి తన వంతు వ్యూహాలను రూపొందించుకుంటోంది. అయితే ఈ విషయంలో కనీసం 150 సీట్ల మార్క్ ని సాధించడానికి కాంగ్రెస్ ఏమి చేస్తోంది అన్నదే అతి పెద్ద ప్రశ్న. కాంగ్రెస్ కి రాహుల్ గాంధీ అగ్ర నేతగా ఉన్నారు. ఆయన కేంద్ర ప్రభుత్వ విధానాలను లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడిగా విమర్శించవచ్చు. కానీ మోడీని వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం మాత్రం తప్పుడు వ్యూహం అవుతుందని అంటున్నారు. అది బూమరాంగ్ కూడా అవుతుందని అంటున్నారు. జనాలకు రాంగ్ మెసేజ్ ; రాహుల్ గాంధీ ఆ మధ్యన పార్టీ సమావేశంలో రాహుల్ గాంధీ విదేశాంగ విధానం మీద మాట్లాడుతూ ఆయన ఇతర దేశాల నేతలతో ఆలింగనాలు ఎలా చేసుకుంటారు అన్న దానిని పార్టీ నేతలతో కలిసి చేసి చూపించారు. అది కూడా అపుడు రాజకీయ రచ్చకు దారి తీసింది. ఇపుడు చూస్తే మరోసారి ఇండోర్‌లో చేసిన మోడీ అనుకరణ కార్యక్రమం మీద బీజేపీ నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్కడ జరిగిన ఛాత్రోం కీ గూంజ్ కార్యక్రమంలో స్టాండప్ కమెడియన్ పుల్కిత్ మణితో కలిసి రాహుల్ గాంధీ మోడీ మీద చేసిన వ్యాఖ్యలు, హావభావాలు ఇప్పుడు రాజకీయంగా అతి పెద్ద దుమారాన్నే రేపుతున్నాయి. ఈ విధంగా దేశ ప్రధానిని వయసులో పెద్ద అయిన మోడీని రాహుల్ గాంధీ కామెడీ అంటూ చేస్తున్న తీరు మీద జనాలకు కూడా రాంగ్ మెసేజ్ వెళ్తుందని అంటున్నారు. దాని వల్ల రాహుల్ గాంధీ మోడీ మీద వ్యక్తిగత అభిప్రాయ భేదాలతోనే విమర్శిస్తున్నారు అన్నది బలంగా వెళ్తుంది అని అంటున్నారు. రాహుల్ గాంధీ సామాన్య నాయకుడు కాదు, ఆయన గాంధీల వంశానికి చెందిన వారసుడు, అంతే కాదు లోక్ సభలో ప్రతిపక్ష నేత. ఆయన కాబోయే ప్రధాని అన్న ట్యాగ్ లైన్ తో ముందుకు సాగుతున్న నేత. ఆయన మోడీ ప్రభుత్వం విధానాలను నిశితంగా విమర్శించవచ్చు. అంతే కాదు బీజేపీ చేసే ప్రజా వ్యతిరేక విధానాలను గణాంకాలతో సహా జనం ముందు పెట్టవచ్చు. ఆ పార్టీ తీరుని ప్రతీ వేదిక మీద రాజకీయంగా ఎండగట్టవచ్చు. అయితే ఒక దేశ ప్రధాని బాడీ లాంగ్వేజ్ విషయం కానీ ఆయన వ్యవహార శైలి గురించి కానీ చేసే విమర్శలు అయితే తేలికగానే జనాలు చూస్తారు. వాటి మీద లాభం కంటే నష్టమే ఎక్కువగా వస్తుందని రాహుల్ గాంధీ గుర్తించాలని అంటున్నారు. ఇప్పటికే రాహుల్ మీద నాన్ సీరియస్ పొలిటీషియన్ అని ఒక ముద్ర బలంగా బీజేపీ వేస్తోంది. దానిని తొలగించుకునే విధంగా వ్యవహరించాలి కానీ ఒక సాధారణ నాయకుడి మాదిరిగా స్టాండ్ కమెడియన్ల తో కలసి ఈ తీరు ఏంటి అని అంటున్నారు. మొత్తానికి చూస్తే మోడీకి ధీటు అయిన నేతగా రాహుల్ అవతరించే క్రమంలో చేస్తున్న తడబాట్లు పొరపాట్లే 2029 ఎన్నికల్లో జనాల పరీక్షకు గురి అవుతాయని గుర్తెరగాలని సూచిస్తున్నారు.

## వినాయక నిమజ్జన ఏర్పాట్లను మరింత పెంచండి



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 21 :(వార్త ప్రభ ప్రతినిధి)** వినాయక నిమజ్జన ఏర్పాట్లను మరింత పెంచండి మరింత పెంచాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం ఉదయం తన పర్యటనలో భాగంగా వన్ టౌన్, సీతమ్మ వారి పాదాల వద్ద జరుగుతున్న వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వినాయక నిమజ్జనానికి చివరి రోజులు కావడంతో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వినాయక విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉన్నందున, అందుకు అనుగుణంగా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా పూజా వ్యర్థాలను విగ్రహాల నుంచి వేరు చేసి సేకరించే పారిశుద్ధ్య సిబ్బంది సంఖ్యను మరింత పెంచి, ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ప్రక్రియ ఎటువంటి ఇబ్బందులు లేకుండా వేగంగా పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, వియంసి వారు ఏర్పాటుచేసిన తాగునీరు, వైద్య శిబిరాల లో లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సి. హెచ్. నిర్మల గ్లోరీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె. శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## వినాయకుడి వీడ్కోలు



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 21(వార్తా ప్రభ ప్రతినిధి):** మండల పరిధిలోని జూపూడి గ్రామంలో వినాయకుడికి విశిష్టత పూజలతో ఘనంగా వీడ్కోలు పలికారు. నాయక్ యూత్ ఆధ్వర్యంలో మండపంలో పూజలు మరియు లడ్డు వేలం నిర్వహించి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించి నృత్యాలతో స్వామి వారిని గ్రామ సమీపము కృష్ణానది లోని నిమజ్జనం చేశారు.

# ఎమ్మెల్సీ వర్ల రామయ్య కుటుంబానికి దక్కిన అరుదైన గౌరవం

● వర్ల రామయ్య కుటుంభానికి ముఖ్య మంత్రి చంద్రబాబు ఇచ్చిన ప్రాధాన్యత ● రాజకీయాల్లో ప్రజాసేవ, నిబద్ధతతో పాటు ఓర్పు చాలా అవసరం... ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ● వర్ల రామయ్య, వర్ల కుమార్ రాజా కు ఘన సత్కారం.. ముఖ్య అతిథిగా హాజరైన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు





**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 21 :(వార్త ప్రభ ప్రతినిధి)** తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, శాసనమండలి సభ్యులు వర్ల రామయ్య కి, పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా కి ముఖ్య మంత్రి ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. చంద్రబాబుని నమ్మి ఎంతో గౌరవమైన ఉద్యోగాన్ని వదులుకొన్న వర్ల కుటుంభాన్ని అయన అందలం ఎక్కించారు. ఈ సందర్భంగా తండ్రి తనయులు ఒకే వేదికపై ఘనంగా సత్కారాలు అందుకొన్నారు. వారికీ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ గురజాల శాసనసభ్యులు ఎరపతినేని శ్రీనివాసరావు పిడుగురాళ్ల మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన అభినందన సన్మాన సభకు నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. వర్ల రామయ్య తన కెరీర్‌లో 10 సంవత్సరాల సర్వీస్ మిగిలి ఉండగానే పోలీస్ ఉద్యోగానికి రాజీనామా చేసి, అప్పటి ముఖ్యమంత్రి పిలుపు మేరకు రాజకీయాల్లోకి వచ్చారని గుర్తుచేశారు. నిరంతరం ప్రజలతో మమేకమై ఉంటూ, పార్టీ కోసం శ్రమించే నాయకులను తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని, ముందుకు తీసుకెళ్తుంద అనడానికి రామయ్య నిదర్శనమని అన్నారు.

**రాజకీయాల్లో ప్రజాసేవ, నిబద్ధతతో పాటు ఓర్పు చాలా అవసరం**

రాజకీయాల్లో ఆశించే యువతకు, నాయకులకు "ఓర్పు, క్రమశిక్షణ" చాలా అవసరమని ఎంపీ పిలుపునిచ్చారు. 1999లో ఉద్యోగానికి రాజీనామా చేసిన రామయ్య ఎమ్మెల్సీ అయ్యేందుకు 2026 వరకు ఓర్పుతో పార్టీకి సేవ చేశారని, వారి కుమారుడు కుమార్ రాజా క్రమశిక్షణతో పనిచేసి ఎమ్మెల్యేగా గెలిచారని తెలిపారు. తొందరపాటు లేకుండా నిలకడగా ఉండేవారికే రాజకీయాల్లో భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు. అభినందన సభను అత్యంత ఘనంగా ఏర్పాటు చేసిన గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావుకి.. హాజరైన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు మరియు రామయ్య కుటుంబ సభ్యులకు ఎంపీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# బిల్డింగ్ ప్లాన్ సమస్యల పరిష్కారానికి ప్రధాన కార్యాలయంలో హెల్ప్ డెస్క్

**విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 21 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరంలో బిల్డింగ్ ప్లాన్లకు సంబంధించి ప్రజలు ఆన్లైన్ లో ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను కమిషనర్ స్వయంగా పరిశీలించి, అక్కడ అందుబాటులో ఉన్న ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ నగర ప్రజలు తమ భవన నిర్మాణాలకు సంబంధించి బిల్డింగ్ ప్లాన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సమయంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అప్లికేషన్ ప్రాసెస్, ప్లాన్ డ్రాయింగ్, పేమెంట్స్ తదితర అంశాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే ప్రజలు హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి అవసరమైన సహాయం పొందవచ్చని అన్నారు. బిల్డింగ్ ప్లాన్‌లకు సంబంధించిన ప్రక్రియలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మార్గదర్శకత్వం, సాంకేతిక సహకారం అందించాలని సంబంధిత సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. హెల్ప్ డెస్క్‌ను సద్వినియోగం చేసుకుని ప్రజలు తమ సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, ప్లానింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# డీఎస్సీ స్పోర్ట్స్ కోటా కుంభకోణంపై భగ్గుమన్న బెజవాడ

● శాప్ కార్యాలయం ఎదుట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఉగ్రరూపం! ● పోలీసుల బారికేడ్లను బద్దలుకొడుతూ దూసుకెళ్లిన వైఎస్సార్‌సీపీ కేడర్ ● ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ వైసిపి ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు.





**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 21, :(వార్త ప్రభ ప్రతినిధి)** కూటమి ప్రభుత్వంలో డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో చోటుచేసుకున్న భారీ అక్రమాలు, పచ్చి బరితెగింపుపై బెజవాడ నగరం రణరంగంగా మారింది. క్రీడాకారుల భవిష్యత్తును తాకట్టు పెడుతూ, నిబంధనలను తుంగలో తొక్కుతూ అర్హులకు చేస్తున్న తీవ్ర అన్యాయాన్ని నిలదీసేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపుతో శాప్ కార్యాలయం వద్ద నిరసన జ్వాలలు మిన్నంటాయి. మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ వైసిపి ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం శ్రేణులతో తరలివచ్చి భారీ ఎత్తున కదంతొక్కారు. శాప్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు కదిలివచ్చిన జనప్రవాహాన్ని చూసి హడలిపోయిన కూటమి ప్రభుత్వం, రెడ్ సర్కిల్, స్టేడియం పరిసర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించి భారీ బారికేడ్లతో అప్రజాస్వామికంగా అడ్డుకునేందుకు కుట్ర పన్నింది.

**తోపులాట.. ఉద్రిక్తత.. హోరెత్తిన నినాదాలు:** పోలీసుల అక్రమ నిర్బంధాలకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తూ---"భయం ఉన్న చోట విజయం ఉండదు.. తెగింపు ఉన్న చోట ఓటమి ఉండదు" అన్న సంకల్పంతో వైయస్సార్‌సీపీ శ్రేణులు దూసుకెళ్లాయి. బారికేడ్లను సైతం లెక్కచేయకుండా కార్యకర్తలు ముందుకు కదలడంతో పోలీసులు–ఆందోళనకారుల మధ్య తీవ్ర తోపులాట జరిగి, శాప్ స్టేడియం పరిసర ప్రాంతాలన్నీ ఉద్రిక్తంగా మారాయి. కూటమి ప్రభుత్వ అవినీతి, పక్షపాత వైఖరికి వ్యతిరేకంగా కార్యకర్తల నినాదాలతో బెజవాడ దద్దరిల్లింది.

**సీబీఐతో విచారణ జరపాల్సిందే – – మాజీ మంత్రి వెలంపల్లి డిమాండ్:** ఈ సందర్భంగా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు:రాష్ట్రంలో కూటమి పాలన వచ్చాక ప్రతి ప్రభుత్వ రిక్రూట్‌మెంట్‌లోనూ కళ్లుచెదిరే స్కాంలే దర్శనమిస్తున్నాయి. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో నిబంధనలన్నింటినీ కాలరాసి, రక్తం ధారపోసి మెడల్స్ సాధించిన అసలైన క్రీడాకారుల పొట్టకొట్టారు. అర్హులైన క్రీడాకారులను రోడ్డున పడేసి, అనర్హులకు, పైరవీకారులకే పోస్టులు కట్టబెడుతూ శాప్ కార్యాలయాన్ని అవినీతి అడ్డాగా మార్చేశారు. ఈ స్పోర్ట్స్ కోటా కుంభకోణంపై తక్షణమే సీబీఐ చేత సమగ్ర విచారణ జరిపించాలి. అర్హులకు న్యాయం జరిగే వరకు, అవినీతి అక్రమార్కులను, వారికి కొమ్ముకాస్తున్న ప్రభుత్వ పెద్దలను కటకటాల వెనక్కి నెట్టే వరకు వైయస్సార్‌సీపీ పోరాటం ఆగదు." రాష్ట్రంలోని నిరుద్యోగులు, క్రీడాకారుల పక్షాన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని, కూటమి ప్రభుత్వ దోపిడీ పాలనను ప్రజల తరపున ఎండగడుతూనే ఉంటామని ఆయన హెచ్చరించారు.

# జాతీయ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో విజయవాడకు చెందిన వాట్ వెల్ఫేర్ సెక్రెటరీ,తన తనయుడికి కి గోల్డ్ మెడల్స్

**అభినందించిన విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 21 :(వార్త ప్రభ ప్రతినిధి)** హైదరాబాద్‌లోని కాటేదాన్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం నిర్వహించిన ఓపెన్ నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో విజయవాడకు చెందిన తండ్రీకొడుకులు విశేష ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్స్ సాధించడం అభినందనీయమని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో గోల్డ్ మెడల్స్ సాధించిన ఉప్పాల మురళీ మోహిత్, ఉప్పాల కోటేశ్వరరావులను కమిషనర్ అభినందించారు .యనమలకుదురుకు చెందిన 10 ఏళ్ల ఉప్పాల మురళీ మోహిత్ ఎల్లో బెల్ట్ కట విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు. మురళీ మోహిత్ విజయ పబ్లిక్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. అదేవిధంగా యనమలకుదురుకు చెందిన ఉప్పాల కోటేశ్వరరావు 40 ఏళ్ల వయస్సులో ఎల్లో బెల్ట్ కట విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ విధి నిర్వహణతో పాటు క్రీడలపై ఆసక్తిని కొనసాగిస్తూ జాతీయ స్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన కోటేశ్వరరావును, చిన్న వయస్సులోనే కరాటేలో ప్రతిభ కనబరుస్తున్న మురళీ మోహిత్‌ను అభినందించారు. తండ్రీకొడుకులు క్రీడా రంగంలో సాధిస్తున్న విజయాలు యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. క్రీడలతో పాటు విధి నిర్వహణలోనూ అంకితభావంతో ముందుకు సాగుతూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ఉత్సాహభరితంగా హరివిల్లు ఫౌండేషన్ సర్వసభ్య ఆత్మీయ సమావేశం



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 21 :(వార్త ప్రభ ప్రతినిధి)** హరివిల్లు ఫౌండేషన్, విజయవాడ వారి ఆత్మీయ సర్వసభ్య సమావేశం బృందావన్ కాలనీ, ఎం. జి. రోడ్డులోని వైకుంటపురం కన్వెన్షన్ హాలులో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రధానకార్యదర్శి అయిన డా. శరత్ కుమార్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు క్రితం ఆరుగురు సభ్యులతో మొదలైన ఈ ఫౌండేషన్ నేడు నూట యాభై మందికి పైగా సభ్యులతో తమ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, బయట దాతల సహకారం ఏమీ తీసుకోకుండానే కేవలం తమ సభ్యులు, సభ్యురాళు ప్రతి నెల కొంత మొత్తాన్ని అకౌంటులో జమచేసుకుని ఆ డబ్బులతోనే ఇప్పటివరకూ పేద ప్రజలకు అవసరమైన షుమారు ఆరు లక్షల రూపాయల విలువైన అనేక సేవాకార్యక్రమాలు చేశామని, భవిష్యత్తులో తమ సేవాకార్యక్రమాలను ఇంకా విస్తృతంగా చేసే ప్రయత్నాలు చేసున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఇటీవలి కాలంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్(అప్నా)ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తమ ఫౌండేషన్ ద్వారా నడపబడుచున్న ఉచిత ప్రాథమిక వైద్య చికిత్సా కేంద్రం కన్సల్టెంట్ అయిన డా. రసిక్ సంఘ్వీ గారిని ఘనంగా సత్కరించారు. డాక్టర్ రసిక్ సంఘ్వీ మాట్లాడుతూ హరివిల్లు ఫౌండేషన్ సభ్యులు, సభ్యురాళ్ళ నిరుపేదలకు వైద్య, విద్య, మరియు ఇతర రంగాలలో చేస్తున్న నిస్వార్థ సేవలను అభినందించారు. ఫౌండేషన్ అధ్యక్షులు ఎం. శశికాంత్ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ లోని ప్రతి సభ్యుడూ, సభ్యురాలు వారి జీవితం మరియు సంపాదన కేవలం వారికోసమే కాకుండా కొంత పేద ప్రజల కోసం కూడా అనే భావనతో సేవాకార్యక్రమాలు చేస్తున్నారని, వారందరి సమిష్టి కృషి వల్లే తమ హరివిల్లు ఫౌండేషన్ ఇప్పటివరకూ ఎన్నో సేవాకార్యక్రమాలు చేయగలుగుతుందని ఈ సేవాభావం ఇలాగే కొనసాగాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు ఎం. బాలసూర్యనారాయణ, యు.కనకారావు, ఎస్.కె.మొహమ్మద్ రఫీ, ఎం.రవి కుమార్, ఎం.వి.ఎస్.ఎన్.ప్రసాద్, జి.ఎన్.బి.అప్పలరాజు, కె.రాజు, హబీబ్ బాషా, కార్యవర్గ సభ్యురాలు శ్రీమతి. శ్రీదేవి మరియు ఇతర సభ్యులు, సభ్యురాళ్లు పాల్గొన్నారు.

**టీడీపీ కార్యకర్త అనసూరి దివాకర్ కుటుంబానికి ప్రమాద బీమా పత్రాలు అంద జేసిన:- పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి బుద్ధా వెంకన్న**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 21 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజక వర్గం మల్లికార్జునపేట బుద్ధా వెంకన్న గారి కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ 47 డివిజన్ కి చెందిన అనసూరి దివాకర్ ప్రమాదవశాత్తు మృతి చెందారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కలిగి ఉన్నందున పార్టీ అందిస్తున్న రూ. 5 లక్షల ప్రమాద బీమాకు సంబంధించిన పత్రాలను ఆయన సతీమణి శివపార్వతికి విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుద్ధా వెంకన్న అందజేశారు. ఈ సందర్భంగా బుద్ధా వెంకన్న మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలవడం తెలుగుదేశం పార్టీ బాధ్యత అని తెలిపారు. కార్యకర్తల సంక్షేమం కోసం పార్టీ అందిస్తున్న ప్రమాద బీమా పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అనసూరి దివాకర్ కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని బుద్ధా వెంకన్న భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షులు నాగోతి రామారావు, పి చిన్న సుబ్బయ్య,అమర మురళి, సాదరబోయిన ఏడుకొండలు, చందన సురేష్ ( మామ) మైలుమూరి లావణ్య, భవాని ప్రసాద్, బొబ్బూరి శీను, ఈగల సాంబ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ బుద్ధా వెంకన్న



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 21 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ 47వ డివిజన్ కే ఎల్ రావు నగర్ 5వ లైన్‌లో బాలగణపతి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ బుద్ధా వెంకన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమ నిర్వాహకులను అభినందించి, భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో మాకినేని భాస్కరరావు, హరి కిరణ్, నాగోతి రామారావు , నమ్మిన భాను తదితరులు పాల్గొన్నారు.

## సమాజానికి నాణ్యమైన సేవలే రామ్ కీ ఫౌండేషన్ ధ్యేయం



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 21 (వార్తా ప్రభ ప్రతినిధి):** ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే రామ్ కీ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని ఆ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ షేక్ సుభాని అన్నారు. రామ్ కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెచ్ డీఎఫ్ సీ పరివర్తన్ సహకారంతో స్థానిక ఏపీహెచ్‌ఎంఈఎల్ కాలనీలో సోమవారం ప్రత్యేక ఆర్థోపెడిక్ వైద్య శిబిరం నిర్వహించారు. డీఎన్ బీ ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ రామ్మోహన్, డాక్టర్ జాన్ సైదా రోగాలను పరీక్షించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ హెచ్ డీఎఫ్ సీ పరివర్తన్ సహకారంతో వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. రామ్ కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. స్టాఫ్ నర్స్ అశ్విని, ల్యాబ్ టెక్నీషియన్ రమ్య, ఫార్మసిస్ట్ తదితరులు సేవలందించారు.

# జనసేనలో చేరిన ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆర్యవైశ్య యువ నాయకుడు

**విజయవాడ మిడ్‌టౌన్ రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్**

**పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సామినేని ఉదయభాను, పెనుగొండ సుబ్బారాయుడు**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 21 :(వార్త ప్రభ ప్రతినిధి)**ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ పాలనలో తనదైన ముద్ర వేస్తున్నారని, ఆయన ప్రజాసేవకు ఆకర్షితులై అనేకమంది పార్టీ వైపు చూస్తున్నారని జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను తెలిపారు. ఈ నేపథ్యంలో సేవా రంగంలో అనుభవం ఉన్న ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆర్యవైశ్య యువ నాయకుడు, విజయవాడ మిడ్‌టౌన్ రొటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్ చేరిక విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో పార్టీకి మరింత బలాన్నిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు నచ్చి ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆర్యవైశ్య యువ నాయకుడు, విజయవాడ మిడ్‌టౌన్ రొటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్ జనసేన పార్టీలో చేరారు. పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.పార్టీలో చేరే ముందు గుడిపాటి కిషోర్ తన మద్దతుదారులతో కలిసి వన్ టౌన్ వినాయకుడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ బైక్ ర్యాలీతో జనసేన జిల్లా కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సామినేని ఉదయభాను మాట్లాడుతూ.. ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ పాలనలో తనదైన ముద్ర వేస్తున్నారని, ఆయన ప్రజాసేవకు ఆకర్షితులై అనేకమంది పార్టీ వైపు చూస్తున్నారని తెలిపారు. సేవా రంగంలో అనుభవం ఉన్న కిషోర్ చేరిక విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో పార్టీకి మరింత బలాన్నిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.అనంతరం సి ఎ పెనుగొండ సుబ్బారాయుడు రానున్న కార్పొరేషన్ మున్సిపల్ ఎన్నికల్లో 100% స్ట్రైక్ రేటుతో విజయం సాధించాలని లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. యువకుడు గుడిపాటి కిషోర్ జనసేన పార్టీ లో చేరిక సందర్భంగా పార్టీకి మరింత బలం చేకూరిందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ యువతకు రాజకీయాల్లో పెద్దపీట వేస్తున్నారని ఆయనకు పార్టీలో ఉన్నత పదవి లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.అనంతరం గుడిపాటి కిషోర్ మాట్లాడుతూ.. రోటరీ క్లబ్, ఆర్యవైశ్య సంఘాల ద్వారా అనేక సేవా కార్యక్రమాలు అందించానని, రాజకీయ వేదిక ద్వారా ప్రజలకు మరింత విస్తృతంగా సేవ చేయవచ్చనే ఉద్దేశంతోనే జనసేనలో చేరినట్లు స్పష్టం చేశారు. తనతో పాటు మరో వంద మంది నాయకులు, అనుచరులు పార్టీలో చేరారని, కూటమి బలోపేతానికి, యువజన విభాగం పటిష్టతకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో కిషోర్‌తో పాటు అన్నం సాయి, సునీత, నూలి శ్వేత, గర్రె ఉదయ్, అనిల్ రాజ్, బుర్రిశెట్టి శ్రీనివాస్, నూలు కృష్ణారావు, అయ్యప్ప తదితరులు పార్టీలో చేరారు. మాజీ కార్పొరేటర్లు అప్పాజీ, మధు, పిల్ల రాజేష్, పార్టీ నాయకుడు బాడిత శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## 44వ, డివిజన్ లో అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న బుద్ధా, నాగుల్ మీరా



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 21 :(వార్త ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 44 వ డివిజన్ నాలుగు స్తంభాల సెంటర్‌లో బడుగు గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి పూజా కార్యక్రమం మరియు అన్నదాన కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి బుద్ధా వెంకన్న , నూర్ భాషా కార్పొరేషన్ చైర్మన్ కె. నాగుల్ మీరా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.విఘ్నాలను తొలగించి ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, శాంతి, సౌభాగ్యం ప్రసాదించాలని శ్రీ వినాయకుడిని ప్రార్థించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బొడ్డేపల్లి శ్రీనివాసరావు, రేగళ్ల లక్ష్మణ, పరస జగదీష్, పామర్తి అరుణ్ కుమార్, పరస గిరీష్, పుట్టపు రమేష్, పాతర్ల గడ్డ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లులకుపౌష్టికాహారం అందించాలి



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 21 (వార్తా ప్రభ ప్రతినిధి):** పిల్లలు,గర్భిణులు, బాలింతల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించాలని ఐసీడీఎస్ అధికారులు అవగాహన కల్పించారు. పోషణ మాసోత్సవంలో భాగంగా మండల పరిధిలోని తుమ్మలపాలెం గ్రామ అంగన్ వాడీ కేంద్రంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాలింతలకు ఆహారంలో వైవిధ్యం గురించి వివరించారు. అంగన్ వాడీ కేంద్రంలో పిల్లలకు వేడిగా భోజనం తయారు చేసి చూపించారు. మరుగుదొడ్డి ఉపయోగించినప్పుడు చేతులు శుభ్రంగా చేసుకోవాలని, వంటలు నూనె చక్కెర శాతం తగ్గించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శివ కుమారి, అంగన్వాడి కార్యకర్తలు సుజాత, శివలక్ష్మి, కోటేశ్వరి, తల్లులు పాల్గొన్నారు.

# కృత్రిమ కాళ్లతో దివ్యాంగ బాలలు విద్య కొనసాగించడం అభినందనీయం

**హీల్ ఆధ్వర్యంలో ఎనిమిది మంది బాలలకు కృత్రిమ కాళ్ల అందజేత**

**2026-27లో 100 మందికి కృత్రిమ కాళ్లు అందించనున్న లయన్స్ క్లబ్**



**ఆగిరిపల్లి, సెప్టెంబర్ 21 (వార్తా ప్రభ ప్రతినిధి):** ఏలూరు జిల్లా, నూజివీడు నియోజకవర్గం, పుట్టుకతోగాని, ప్రమాదాల కారణంగాగాని కాళ్లు కోల్పోయిన దివ్యాంగ బాలలు నాణ్యమైన కృత్రిమ కాళ్లను వినియోగించుకుంటూ విద్యాభ్యాసాన్ని కొనసాగించడం అభినందనీయమని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 316డి గవర్నర్ ఎన్.వి.వి.ఎస్.వి. ప్రసాద్ అన్నారు.ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో అమెరికాకు చెందిన దివంగత ఇమ్మాది రామకృష్ణ రెండో పుణ్యతిథి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు విజయలక్ష్మి, కుమారులు శ్యామ్, నిఖిల్ అందించిన ఆర్థిక సహాయంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఎనిమిది మంది దివ్యాంగ బాలలకు కృత్రిమ కాళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతికతతో తయారు చేసిన కృత్రిమ కాళ్లు దివ్యాంగ బాలల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు సాధారణ జీవనానికి దోహదపడతాయని తెలిపారు.లయన్స్ క్లబ్ 316డి ఆర్థిక సహకారంతో హీల్ సంస్థ ఆధ్వర్యంలో 2026--27 సంవత్సరంలో 100 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందించనున్నట్లు వెల్లడించారు.కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ టి. దుర్గా మల్లేశ్వరరావు, డిస్ట్రిక్ట్ కృత్రిమ అవయవ విభాగం చైర్మన్ జోస్యుల శ్రీరామ్ పవన్, హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, సీఈఓ కూరపాటి అజయ్ కుమార్, కృత్రిమ అవయవ కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల తోపులాటలో గాయపడి స్పృహతప్పిన వైసీపీ నాయకుడు కరీమ్

**ఆంధ్రా హాస్పిటల్‌లో పరామర్శించిన మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 21 :(వార్త ప్రభ ప్రతినిధి)**డీఎస్సీ స్పోర్ట్స్ కోటా అక్రమాలపై శాప్ కార్యాలయం వద్ద వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమంలో పోలీసుల తోపులాట కారణంగా గాయపడి స్పృహతప్పి పడిపోయిన పార్టీ కార్యకర్త కరీమ్‌ను మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ శ్రీ వెలంపల్లి శ్రీనివాసరావు ఆంధ్రా హాస్పిటల్‌కు వెళ్లి పరామర్శించారు. ఆందోళన సందర్భంగా పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ బారికేడ్ల వద్ద అమానుషంగా వ్యవహరించడంతో గాయపడి, తీవ్ర ఒత్తిడి, తోపులాటకు గురైన కరీమ్ ఒక్కసారిగా కుప్పకూలిపోగా, వెంటనే ఆయన్ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రికి చేరుకున్న మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు వెంటనే వైద్యులతో మాట్లాడి కరీమ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి అవసరమైన మెరుగైన వైద్య సదుపాయాలు, అన్ని రకాల పరీక్షలు నిరంతరం అందించి పూర్తిస్థాయిలో కోలుకునేలా చూడాలని వైద్యులకు సూచించారు.అనంతరం అక్కడే ఉన్న కరీమ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. క్రీడాకారుల హక్కుల కోసం, ప్రజా సమస్యలపై శాంతియుతంగా పోరాడుతున్న తమ కార్యకర్తలపై పోలీసులు ఈ విధంగా దమననీతి ప్రదర్శించడం దారుణమని మండిపడ్డారు. పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తలకు, వారి కుటుంబాలకు అండగా నిలబడుతుందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు.

## వినాయక మండపాల్లో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 21 :(వార్త ప్రభ ప్రతినిధి)** వినాయక చవితి మహోత్సవాలను పురస్కరించుకుని విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో భక్తిశ్రద్ధలతో కొలువుదీరిన వినాయక మండపాలను మాజీ మంత్రివర్యులు, విజయవాడ పశ్చిమ వైఎస్సార్సీపీ ఇన్‌ఛార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నసంతర్పణ కార్యక్రమాలను ప్రారంభించి, భక్తులకు ఆయనే స్వయంగా భోజనాలు వడ్డించారు.స్థానిక బ్రాహ్మణ వీధి, పోతిన వారి వీధిలో 'శ్రీ విఘ్నేశ్వర సేవా సమితి' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని పూజాదికాలు నిర్వహించిన అనంతరం, భక్తులకు అన్నసంతర్పణను ప్రారంభించి స్వయంగా వడ్డన చేశారు.అలాగే, స్థానిక బంగారయ్య కొట్టు సందులో 'శ్రీ లక్ష్మీ గణపతి ఫ్రెండ్స్ సర్కిల్' ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలలో పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు భోజనాలు వడ్డించారు.ఈ కార్యక్రమాలలో స్థానిక వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పేరుకే 'స్వర్ణ చంద్రగిరి'.. సంక్షేమానికి మాత్రం అడ్డంకులే

**పాత హౌస్‌హోల్డింగ్ మ్యాపింగ్ డేటాతో అర్హులకూ అనర్హత ముద్ర... వికలాంగుల పింఛన్లకూ బ్రేక్**




**చంద్రగిరి: సెప్టెంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పేరుకే 'స్వర్ణ చంద్రగిరి' అని చెప్పుకుంటున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పింఛన్ల విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై అర్హులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.2020లో నిర్వహించిన హౌస్‌హోల్డింగ్ మ్యాపింగ్ వివరాలను ఆధారంగా చేసుకుని, ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారిపోయినప్పటికీ అర్హులను అనర్హులుగా గుర్తిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రేషన్ కార్డులు వేర్వేరుగా ఉన్నప్పటికీ, 2020లో రూపొందించిన హౌస్‌హోల్డింగ్ మ్యాపింగ్ ఆధారంగా వారిని ఒకే కుటుంబంగా చూపిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం చేస్తున్నారని అర్హులైన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అప్పటి కుటుంబ పరిస్థితులు, ఆర్థిక స్థితిగతులు, నివాస వివరాలు ప్రస్తుతం మారిపోయినప్పటికీ పాత డేటానే ప్రామాణికంగా తీసుకోవడం వల్ల కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న పలువురి దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయని చెబుతున్నారు.ముఖ్యంగా వికలాంగులు, వృద్ధులు, పింఛన్‌పైనే ఆధారపడి జీవిస్తున్న నిరుపేదలు హౌస్‌హోల్డింగ్ మ్యాపింగ్ ఆధారంగా అనర్హులుగా గుర్తించబడటంతో తీవ్ర మానసిక ఆవేదనకు గురవుతున్నారని వాపోతున్నారు. జీవనాధారమైన పింఛన్ నిలిచిపోవడంతో కుటుంబాలను పోషించుకోవడం కూడా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.హౌస్‌హోల్డింగ్ మ్యాపింగ్ వివరాలను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సరిచేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు."పేరుకే స్వర్ణ చంద్రగిరి.. అర్హులకు సంక్షేమం అందకపోతే ఇదేనా స్వర్ణ చంద్రగిరి?" అంటూ ప్రభుత్వంపై, అధికారులపై ప్రజలు మండిపడుతున్నారు.

## కొండపల్లి మెయిన్ రోడ్ విస్తరణ ఎప్పుడు సారూ..!

**ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలం**

**జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్**




**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 21(వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లి మెయిన్ రోడ్ విస్తరణ ఎప్పుడు అని... సమయం గడిచిపోతున్న అధికారులు కనీసం ప్రాథమిక చర్యలు చేపట్టకపోవడం తీవ్ర విచారకరమని అన్నారు ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపల్లి మెయిన్ రోడ్డు సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ హామీ ఇచ్చారని, అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. మునిసిపల్ ఛైర్మెన్, పాలకవర్గం, మున్సిపల్ అధికారులు కాలయాపన చేయకుండా వెంటనే రోడ్డు విస్తరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.కొండపల్లి బి కాలనీ నుండి ఎర్ర బ్రిడ్జి" వరకు ఎదురవుతున్న తీవ్ర ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకొని,ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ నాడు అచల పక్షానికి రోడ్డు విస్తరణ పై హామీ ఇచ్చారన్నారు. కలెక్టర్ కు సైతం పలుమార్లు వినతి పత్రాలు సమర్పించామని అయినా స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. మున్సిపల్ అధికారులు ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. నాయకులు అక్కల నాగేంద్ర ప్రసాద్,రాగాల రాము తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఈశ్వర విఘ్నేశ్వర ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం.

**చిట్టినగర్ ఈశ్వర, విఘ్నేశ్వర ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 21 :(వార్త ప్రభ ప్రతినిధి)**గణనాథుడికి ప్రతిరోజు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు.. వేడుకల్లో భాగంగా సోమవారం గణపతి మండపం ప్రాంగణంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్ పాల్గొని విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు.అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్తిపాటి శ్రీధర్ ఆకాంక్షించారు. 47 వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు నాగోతి రామారావు, 46 వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పోతినీడి లోకేష్, జనసేన పార్టీ 47 వ డివిజన్ అధ్యక్షుడు వేంపలి గౌరీ శంకర్ , ఈశ్వర విఘ్నేశ్వర ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు ధన బోయిన శ్రీనివాస్, హేమంత్, కళ్యాణ్, బాలాజీ, మహేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు..

# గురజాడ.. సామాజిక మార్పునకు స్ఫూర్తిజాడ..

**తెలుగు సాహిత్యానికి ఆధునిక దిశను చూపిన మహనీయుడు - జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**




**విజయవాడ, సెప్టెంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసి ప్రజలకు ఆధునిక దిశను చూపడంతో పాటు, తన రచనల ద్వారా సామాజిక చైతన్యాన్ని రగిలించిన మహనీయుడు గురజాడ అప్పారావు అని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. గురజాడ రచనలు సమాజంలోని అసమానతలు, మూఢనమ్మకాలు, సామాజిక రుగ్మతలపై ఆలోచింపజేసి మార్పు వైపు నడిపించాయని పేర్కొన్నారు.నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అధికారులతో కలిసి గురజాడ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురజాడ రచనలు సామాజిక అసమానతలు, మూఢనమ్మకాలపై ఆలోచన రేకెత్తిస్తూ ప్రజల్లో మార్పు కోసం స్ఫూర్తినిచ్చాయని పేర్కొన్నారు. దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్.. అనే గురజాడ సందేశం దేశం, సమాజం పట్ల ప్రతిఒక్కరికీ ఉన్న బాధ్యతను గుర్తుచేస్తోందన్నారు. గురజాడ సాహిత్య స్ఫూర్తితో యువత మానవతా విలువలు, సామాజిక బాధ్యత, సమాజ అభ్యున్నతి పట్ల నిబద్ధతను పెంపొందించుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చతుర్భుజ ప్రాపర్టీస్ అండ్ ఇన్ఫ్రా ఆధ్వర్యంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు





**విజయవాడ, సెప్టెంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆటోనగర్‌లో వినాయక నిమజ్జనోత్సవం నయనానందకరంగా, ఆధ్యాత్మిక శోభతో వైభవంగా సాగింది. చతుర్భుజ ప్రాపర్టీస్ అండ్ ఇన్ఫ్రా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో సంస్థ ప్రతినిధులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. తొలుత నిర్వహించిన స్వామివారి లడ్డూ ప్రసాదం వేలం పాటకు విశేష స్పందన లభించింది. అనంతరం విఘ్నేశ్వరునికి ప్రత్యేక అర్చనలు నిర్వహించి నిమజ్జన శోభాయాత్రను ప్రారంభించారు.విజయవాడ ఆటోనగర్‌లో వినాయక నిమజ్జన ఊరేగింపు మహోత్సవం ఎంతో వైభవంగా, కోలాహలంగా జరిగింది. చతుర్భుజ ప్రాపర్టీస్ అండ్ ఇన్ఫ్రా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో సంస్థ ప్రతినిధులు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత నిర్వహించిన లడ్డూ వేలం పాటకు విశేష స్పందన లభించింది. అనంతరం గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన ర్యాలీని ఘనంగా ప్రారంభించారు. చతుర్భుజ ప్రాపర్టీస్ అండ్ ఇన్ఫ్రా సంస్థ చైర్మన్ ధోనేపూడి దుర్గారావు, మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) నాగేశ్వరరావు, డైరెక్టర్ శ్రీకాంత్ ఈ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని, స్వామివారికి హారతి ఇచ్చారు. అనంతరం ప్రారంభమైన ఊరేగింపులో వారు స్వయంగా పాల్గొని భక్తులతో కలిసి అడుగులు వేశారు.ఊరేగింపు పొడవునా సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాకారుల కోలాట నృత్య ప్రదర్శనలు, ఒళ్లు గగుర్పొడిచే భేతాళ నృత్యాలు, హోరెత్తించే డప్పు వాయిద్యాల నడుమ ర్యాలీ ఎంతో ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. భక్తుల జయ జయధ్వానాలు, ఆధ్యాత్మిక సందడితో ఆటోనగర్ వీధులన్నీ మారుమోగాయి.

## వానహదారులు విధిగా హెల్మెట్ ధరించాలి



**చేజర్ల సెప్టెంబర్ 21 (వార్తాప్రభ)** చేజర్ల సంఘం ప్రధాన రహదారిలో వాహనదారులను ఆపి హెల్మెట్ పై అవగాహన కల్పించడం జరిగినది.ప్రమాదాల నివారణను అరికట్టాలంటే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని చేజర్ల మండల ఎస్సై అయ్యప్ప తెలిపారు.ర్యాస్ డ్రైవింగ్ క్రమశిక్షణ లేని డ్రైవింగ్ చేయరాదని ప్రతి వాహనదారుడు కచ్చితంగా లైసెన్సులు కలిగి ఉండాలని బండి పేపర్లు ఖచ్చితంగా ఉండాలని తెలిపారు.మీ కుటుంబాలను కుటుంబ సభ్యులను గుర్తుకు తెచ్చుకుని వాహనాలు నడపాలని మీరే ఆ కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్నందువలన విధిగా డ్రైవింగ్ చేయాలని సూచించారు.

# డీఎస్సీపై వైసీపీ డ్రామాలు

**- టీడీపీ సీనియర్ నేత జంపాల**



ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 21 (వార్తా ప్రభ ప్రతినిధి): డీఎస్సీపై వైసీపీ దొంగ పోరాటాలు చేస్తుందని టీడీపీ సీనియర్ నేత జంపాల సీతారామయ్య విమర్శించారు. సోమవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడుతూ డీఎస్సీలో అక్రమాలు జరగలేదని తెలిసినా వైసీపీ నాయకులు కావాలనే ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. విజయవాడలో శాప్ కార్యాలయం వద్ద వైసీపీ నాయకులు రౌడీలు, గుండాల్లా ప్రవర్తించారని ఆరోపించారు. రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి చూసి ఓర్వలేక వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంపై డీఎస్సీ రూపంలో విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన కుటుంబాలు ఆనందంతో ఉన్నాయని, వారిలో అభద్రతా భావం పెంపొందించేలా వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రవర్తిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు భవిష్యత్ లో మరెన్నో ఉపాధి అవకాశాలు రాబోతున్నాయని చెప్పారు. వాటిపై వైసీపీ నాయకుల డ్రామాలు ఎన్ని చూడాల్సి వస్తుందోనని చమత్కరించారు.

# వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి.బొడ్డు నోబుల్

**నిరాహార దీక్షకు కాంగ్రెస్ ఇంచార్జ్ సంఘీభావం**



కైకలూరు, సెప్టెంబర్ 21 (వార్తా ప్రభ)గ్రామ రెవెన్యూ సహాయకులు వీఆర్ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరాహార దీక్షకు కైకలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బొడ్డు నోబుల్ సంఘీభావం ప్రకటించారు.వీఆర్ఏలు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. తమకు ప్రస్తుతం అందుతున్న వేతనాలు, ఉద్యోగ భద్రత తదితర అంశాలను ప్రస్తావిస్తూ సమస్యలను పరిష్కరించాలని కోరారు.వీఆర్ఏలు ప్రధానంగా పేస్కేల్ అమలు చేయాలని, వీఆర్ఏలకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా వీఆర్వో తదితర ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే వీఆర్వో తదితర ఉద్యోగాల్లో శాఖాపరమైన కోటాను పెంచాలని కోరుతున్నారు.ఈ నేపథ్యంలో వీఆర్ఏలు చేపట్టిన నిరాహార దీక్షకు బొడ్డు నోబుల్ హాజరై సంఘీభావం తెలిపారు. వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

**వీఆర్ఏల డిమాండ్లు** వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలి.వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా వీఆర్వో తదితర ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలి.వీఆర్వో తదితర ఉద్యోగాల్లో శాఖాపరమైన కోటాను పెంచాలి. ఈ అంశాలను వెంటనే ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని వెంటనే వీఆర్ఏలకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బొడ్డు నోబుల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# అన్నపూర్ణ నివాసంలో రూ. 1.30 లక్షలు పలికిన గణేష్ లడ్డు

**హోరాహోరీగా సాగిన వేలం పాట**

**స్వామివారి ప్రసాదాన్ని దక్కించుకున్న ధాన్వి రెడ్డి**





**చింతల్, సెప్టెంబర్ 21, (వార్తాప్రభ) :** బాపునగర్ ఐదో లేన్‌లోని అన్నపూర్ణ నివాసంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన గణనాథుని పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన గణపతి లడ్డు వేలం పాట మునుపెన్నడూ లేని విధంగా స్థానికుల మధ్య హోరాహోరీగా సాగింది. భక్తుల పోటీ నడుమ సాగిన ఈ వేలం పాటలో మల్లారెడ్డి, లలిత రెడ్డిల మనవరాలు ధాన్వి రెడ్డి ఒక లక్షా ముప్పై వేల ఒక్క రూపాయికి (రూ. 1,30,001) వినాయకుని లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్నారు. స్వామివారి లడ్డును సొంతం చేసుకున్న కుటుంబానికి విఘ్నేశ్వరుని కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని స్థానికులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేయడంలో నాగరాజు ముఖ్య బాధ్యత వహించి విశేష కృషి చేయగా, విజయలక్ష్మి ఆయనకు సహకరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రెసిడెంట్ శేఖర్ చారి, ట్రెజరర్ నాగరాజుతో పాటు ప్రవీణ్, చక్రపాణి, కోటేశ్వర్ రావు, నరసింహారావు, భాస్కర్ రావు, మధు యాదవ్ మరియు కాలనీకి చెందిన మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ కలెక్టర్ ( టూరిజం ) ప్రసన్నలక్ష్మీ దంపతులు.....



పెనుగంచిప్రోలు - సెప్టెంబర్ 21( వార్త ప్రభ ) శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి ని దర్శించు కొని అమ్మ వారి కీ మొక్కు బడులు చెల్లించు కున్న డిప్యూటీ కలెక్టర్ ప్రసన్న లక్ష్మి ( టూరిజం )దంపతులు. వారికు ఆలయ కార్యనిర్వహణాధికారి వారి సూచనల మేరకు అర్చకులు వేద ఆశీర్వచనం అందించగా, దేవాలయ పాలకమండలి చైర్మన్ చుంచు రమేష్ బాబు ప్రసాదాలు అందజేసినారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు మర్రే బోయిన,గోపి బాబు, ధర్మకర్తలు ప్రియాంక, రమేష్, గోపీనాథ్ ,పర్యవేక్షకులు నగేష్ ఆలయ ఇన్స్పెక్టర్ ఎమ్ రామకృష్ణ పాల్గొన్నారు .

# మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి.

**చీఫ్ సెక్రటరి సాయికుమార్ కు వినతి పత్రం అందజేసిన రాష్ట్ర మహిళా విభాగపు అధ్యక్షురాలు డాక్టర్ పామర్తి లీలావతి**





**అమరావతి, సెప్టెంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ కె ఆర్ సూర్యనారాయణ నాయకత్వంలో 18 శాఖల అధిపతులు ఐక్యవేదికగా ఐక్యవేదిక సభ్యులు సోమవారం ఆయా శాఖల సమస్యలను గురించి పిఆర్సి ఆ సంఘంలో నెలకొనే ఉన్న పూర్వపు సమస్యలను గురించి చర్చించేందుకు ఈరోజు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ సాయి కుమార్ ని కలిసి వినతి పత్రాలు సమర్పించారు. ఒక్కొక్క విభాగాన్ని అధ్యక్షులు పరిచయం చేస్తూ ఆయా శాఖలో ఉండేటువంటి సమస్యల గురించి వివరంగా చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకువచ్చారు ఆర్డర్లో ఆర్డర్ ను వ్యతిరేకిస్తుందని ఆ ఆర్డర్ లోకపు ఇష్టమైనదని కేవలం టాలెంటెడ్ పర్సన్స్ లేదా నిపుణత కలిగిన అభ్యర్థులు కాబోయే నిరుద్యోగులు కేవలం ఆయా ప్రాంతాలకే పరిమితం అవడం వలన అటు అభ్యర్థులకు, రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా నష్టం వాటిల్లుతుందని తెలియజేశారు డాక్టర్ పామర్తి లీలావతి మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వాటిని పరిష్కారం దశగా ఆలోచించాలని వినతి పత్రం సమర్పించారు.

# అర్జీల పరిష్కారంలో జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలపాలి

**గడువులోగా పరిష్కారంతో పాటు నాణ్యతకూ పెద్దపీట వేయాలి**

**అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావులేదు**

**.... జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ**



**విజయవాడ: సెప్టెంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతో పాటు, ప్రతి అర్జీకి నాణ్యమైన, న్యాయబద్ధమైన, శాశ్వత పరిష్కారం అందించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ ఆదేశించారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదుల పరిష్కారంలో ప్రజా సంతృప్తిని ప్రధాన ప్రమాణంగా తీసుకుని, గ్రీవెన్స్ పరిష్కారంలో జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలిపేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం తదితర అధికారులతో కలిసి సోమవారం కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుంచి అందిన అర్జీని కేవలం రికార్డుల్లో పరిష్కరించినట్లు చూపించడం కాకుండా, అర్జీదారుని సమస్య వాస్తవంగా పరిష్కరించబడిందా? అర్జీదారు ఆ పరిష్కారంతో సంతృప్తి చెందారా? అనే అంశాలే అర్జీ పరిష్కారానికి అసలు గీటురాయిగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్జీ పరిష్కార ప్రక్రియలో అధికారులు కేవలం కార్యాలయాల్లో ఫైళ్లను పరిశీలించి నిర్ణయాలు తీసుకోవడం కాకుండా, అవసరమైన సందర్భాల్లో క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు, సర్వేయర్లు తదితర అధికారులు అర్జీలపై సమగ్రంగా విచారణ చేపట్టి, అవసరమైతే సంబంధిత ప్రాంతాలను స్వయంగా సందర్శించాలని కలెక్టర్ సూచించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యను పూర్తిగా తెలుసుకోవడంతో పాటు, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి, అందుబాటులో ఉన్న రికార్డులు, నిబంధనలు, చట్టపరమైన అంశాలను పరిశీలించిన అనంతరం న్యాయబద్ధమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు అత్యంత ప్రాధాన్యతతో తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి అర్జీకి నిర్దేశించిన గడువును అధికారులు తప్పనిసరిగా పాటించాలని, గడువులోగా పరిష్కారం సాధ్యంకాని సందర్భాల్లో అందుకు గల కారణాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. అర్జీ పరిష్కార ప్రక్రియలో వేగంతో పాటు పరిష్కార నాణ్యతకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు. అర్జీల పరిష్కారం అనంతరం అర్జీదారుల నుంచి అందే ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్‌ను కూడా అధికారులు ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజల సంతృప్తి స్థాయి, ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్, పరిష్కార నాణ్యత వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకుని అర్జీల పరిష్కారాన్ని నిరంతరం సమీక్షించాలని అన్నారు. ఒకే సమస్యపై ప్రజలు పదేపదే అర్జీలు సమర్పించాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పునరావృతమవుతున్న సమస్యలను గుర్తించి వాటికి మూలకారణాలను పరిశీలించి, భవిష్యత్తులో అదే సమస్య తిరిగి ఉత్పన్నం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు, రెవెన్యూ, భూ సమస్యలు, ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అంశాలపై ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వాటిని సమర్థవంతంగా పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం ప్రభుత్వ పాలనలో అత్యంత కీలకమైన అంశమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రభుత్వంపై నమ్మకంతో పీజీఆర్ఎస్ వేదికను ఆశ్రయిస్తున్నందున, వారి నమ్మకాన్ని నిలబెట్టే విధంగా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

# నెవర్ బిఫోర్ నెవర్ ఆఫ్టర్



**కోనేరు ఓపెన్ జిమ్ కు విశేష ఆదరణ**





**విస్సన్నపేట సెప్టెంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సమాజంలో భోజన ప్రియులు ఎంత అమిత ఇష్టంగా రకరకాల రుచులు కొరకు దూరాన్ని సైతం లెక్కచేయకుండా వెళ్లి స్వీకరిస్తారో అంతకన్నా ఎక్కువగా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన పరిస్థితి ప్రతి ఒక్కరికి ఉంటుందనేది నగ్న సత్యం అని చెప్పాలి. సర్వసాధారణంగా భోజన ప్రియులు రకరకాల రుచులు ఎదురుఎదురుగా కనబడుతుంటే ఎక్కువగా తినటం సర్వత్రా తెలిసిందే. అయితే భవిష్యత్తులో శరీరానికి వచ్చే ఇబ్బందుల నుండి తమను తాము కాపాడుకునేందుకు వాకింగ్ రన్నింగ్ జిమ్ యోగ తదితర సాధనాలను పరమపద సోపానాలుగా చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉంటుంది. తమ ఆరోగ్యాలను తమకు తాము కాపాడుకోవాలనే లక్ష్యంగా మండలంలో నివసించే సాఫ్ట్వేర్లు, వందలాదిమంది తెలుగింటి ఆడపడుచులు ఉదయం సాయంత్రం మరియు రాత్రి సమయాలలో 50 లక్షల రూపాయలతో స్వచ్ఛ కోనేరు నిర్మాణపు పనులు జరుగుతున్న సమయాన్ని సైతం లెక్కచేయకుండా వాకింగ్ చేయటం జరుగుతోంది. వికాస్ టెక్నో స్కూలు దగ్గరలో ఉన్న కోనేరు ఓపెన్ జిమ్ సెంటర్ కు విశేష ఆదరణ నిర్మాణ దశలోనే కలగటం సర్వత్ర ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వాకింగ్ ట్రాకర్ పనులు వేగవంతంగా జరుగుతున్న సమయంలో డిప్యూటీ ఎంపీడీవో రామమోహన్ జిమ్ము పరికరాలలో ప్రత్యక్షంగా వినియోగించి సంతృప్తి చెందారు. శ్రీ సిద్ధార్థ, కె.వి.ఆర్, శ్రీ శ్రీ, విద్యాసంస్థలతో పాటు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు కూడా ఉత్సాహంగా ఉల్లాసంగా ఇక్కడికి వచ్చి పది రకాల ఆటలు వినియోగించుకొని వెళుతూ ఉండటం పిల్లలతోపాటు వారి తల్లిదండ్రులకు కూడా మహదానందంగా ఉన్నదని అంటున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్ల లో రాబోయే కాలంలో పార్కు మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణాలతో పాటు పాల పుష్ప ఔషధ మొక్కలు ఓపెన్ జిమ్ పాయింట్లు పెట్టే అవకాశం ఉంటుందని పలువురు అనుకుంటున్నారు. ఇక్కడికి వచ్చే పిల్లలకు 10 రకాలు సరిపోవటం లేదని మరి ఒక 20 రకాలు యూనిట్లు అవసరమని పేరెంట్స్ అంటున్నారు .తనకు ఎప్పుడు సమయం వస్తుందా అని ఉయ్యాల, అప్ అండ్ డౌన్ స్టాండ్ , జారుడు బల్లలు వద్ద ఎదురుచూసే చిన్నారులు తమ అమ్మ నాన్నలను చూసి బిక్క మొహం పెట్టటం తమకు అవకాశం రాగానే ఫుల్ హ్యాపీ కావటం వారి ముఖారవిందం చెప్పకనే చెబుతుంది. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం స్వచ్ఛ కోనేరు లక్ష్యంగా మంచి నిర్ణయమని కురిచే వర్షాలతో పాటు రెండు బోర్ల ద్వారా ఫ్రెష్ వాటర్ చెరువు నింపేందుకు శ్రీకారం చుట్టటం మంచి ఆలోచన అని అదే రకంగా జిమ్ కేంద్ర పరిధిని మరింత పెంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కొమ్మినేనికి బిజినెస్ ఎక్స్ లెన్స్ లీడర్షిప్ పురస్కారం




**కాకినాడ, సెప్టెంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విద్యారంగంలో అత్యున్నత విలువలతో కూడిన విద్యను అందిస్తూ విద్యార్థినీ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేసేందుకు, బాధ్యతాయుతమైన భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో కృషిచేసిన విదిశా ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కొమ్మినేని వెంకటేష్ కు 2026 సంవత్సరానికి టైమ్స్ ప్రకటించిన బిజినెస్ ఎక్సలెన్స్ లీడర్షిప్ పురస్కారం లభించింది . ఈ అవార్డు రావడం ఆనందదాయకమని విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు. ఐ.ఐ.టి, నిట్, నీట్ కోర్సులలో శిక్షణతో పాటు జాతీయ,అంతర్జాతీయ,రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు తయారు చేయడం, ర్యాంకులను సృష్టించడం విదిష విద్యా సంస్థలకే చెల్లింది. విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడంలో కొమ్మినేని వెంకటేష్ పాత్ర అమోఘము, అద్వితీయము, అజరామరశీ. విదిశ విద్యాసంస్థల ద్వారా విద్యార్థులకు, సమాజానికి చేస్తున్న సేవ, అకుంఠిత దీక్ష, సమయపాలన, ప్రతి విద్యార్థినీ విద్యార్థులపై ఆయన తీసుకునే ప్రత్యేక శ్రద్ధ, విద్యార్థుల విషయ పరిజ్ఞానంతో పాటు ర్యాంకుల, మార్కులు సాధించిన తీరు అనిర్వచనియమని పలువురు పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ఎంతోమంది విద్యార్థులు అత్యంత ప్రతిష్టాత్మకమైన సంస్థలలో ఉన్నత విద్యను అభ్యసించడంలో కొమ్మినేని పాత్ర అనితరసాధ్యమైనది. ఎంతోమందికి ఉపాధి ఉద్యోగాలను కల్పిస్తూ అనేకమందికి మార్గదర్శకం చూపిస్తూ విలువలతో కూడిన విద్యను అందిస్తూ ఒక కొత్త తరానికి నాంది ప్రస్తావనగా ముందుకు సాగుతున్న విదిష విద్యాసంస్థల అధినేతకి విద్యార్థులు హార్దిక శు భాభినందనలు తెలియజేశారు.

# మెరుగైన వైద్యం కోసం ఎల్ ఓ సీ పత్రాలు అందజేత



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 21 :(వార్త ప్రభ ప్రతినిధి)** ఎమ్మెల్యే సుజనా చౌదరి పశ్చిమ ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్. ఓ. సి ) లను జారీ చేస్తున్నారు. ఎమ్మెల్యే సుజనా ఆదేశాలతో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కూటమి నేతలతో కలిసి భవానిపురం, ఎన్డీయే కార్యాలయంలో బాధితులకు ఎల్ ఓ సీ పత్రాలను అందజేశారు.35 వ డివిజన్, డేవిడ్ స్ట్రీట్ కు చెందిన బంకా సతీష్ (32) ప్యాంక్రియాటైటిస్ బాధపడుతూ వైద్య సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 6.22 లక్షల విలువైన ఎల్ ఓ సీ ను అందజేశారు.. ఊర్మిళ నగర్ కు చెందిన జీ కృష్ణారెడ్డి (49) నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 2.96 లక్షల విలువైన ఎల్ ఓ సీ ను అందజేశారు.లంబాడీ పేటకు చెందిన ఉప్పు అరుణ కుమారి (50) గర్భాశయ సంబంధిత వ్యాధితో బాధపడుతూ వైద్య సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 1.54 లక్షల విలువైన ఎల్ ఓ సీ ను అందజేశారు.47 వ డివిజన్ , కే ఎల్ రావు నగర్ కు చెందిన గరికే లక్ష్మి (50) బ్రెయిన్ స్ట్రోక్ తో బాధపడుతూ వైద్య సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 7.68 లక్షల విలువైన ఎల్ ఓ సీ ను అందజేశారు..త్వరితగతిన స్పందించి ఎల్ ఓ సీ ను అందజేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరి కు బాధితుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు..మాజీ కార్పొరేటర్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్, దుర్గమ్మ గుడి ట్రస్ట్ బోర్డు మెంబర్ అవ్వారు శ్రీనివాసరావు,కూటమి నేతలు దుర్భేసుల హుస్సేన్, బొల్లేపల్లి కోటేశ్వరరావు, అహ్మద్ అలీ, షేక్ కరీముల్లా, బుదాల నంద కుమారి తదితరులతో కలిసి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ ఎల్ ఓ సీ పత్రాలు అందజేశారు..

# బిల్లపాడు పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



**చేజర్ల సెప్టెంబర్ 21 (వార్తాప్రభ)** చేజర్ల మండలంలోని బిల్లుపాడుకు చెందిన ఉల్లిపాయల శ్రావణి మై డియర్ నెల్లూరు ఇన్‌స్టాగ్రామ్ 50 వేలమంది ఫాలోవర్స్ వచ్చిన సందర్భంగా బిల్లుపాడు పాఠశాలలో చదువుతున్న 140 మంది విద్యార్థులందరికీ దాదాపు 20 వేల రూపాయల విలువైన నోట్ బుక్స్ ప్యాడ్స్ జామెంట్రీ బాక్స్ పెన్స్ మరియు చాక్లెట్లు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.పి కొండారెడ్డి మరియు ఇతర ఉపాధ్యాయులు అందరూ శ్రావణికి అభినందనలు తెలియజేయడం జరిగింది.

# పిల్లలను బడికి పంపండి.

**-ఎం ఈ వో రవీంద్ర నాయక్.**



**పెనుగంచిప్రోలు - సెప్టెంబర్ 21( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు గ్రామం లోని పాఠశాలలో రోజు బడికి రాని, బడి మాని వేసిన, రెగ్యులర్ గా గర్హాజరు అవుతున్న, బంగారు కాలనీ లోని బడికి రాని విద్యార్థుల ఇంటికి ఎం ఈ వో డి . రవీందర్, సీ ఆర్ పీ జొన్న ల గడ్డ గోపాల్ వెళ్లి వారి తల్లి తండ్రుల తో,విద్యార్థులతో మాట్లాడి ప్రతిరోజు బడికి వెళ్లాలని ఒప్పించి, రేపటి నుంచి బడికి వెళ్తామని విద్యార్థులు, రోజు బడికి పంపిస్తామని వారి తల్లి తండ్రులు తెలిపినారు.ఎన్టీఆర్ జిల్లా విద్యా శాఖ అధికారి ఉత్తర్వుల మేరకు, ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతి రోజు అందరు విద్యార్థులు 100% హాజరు అగు నట్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, బడికి రాని విద్యార్థుల ఇంటికి వెళ్లి బడికి రప్పించాలని, ఆధార్ బయోమెట్రిక్ పూర్తి చేయాలని ఎం ఈ వో డి.రవీందర్ తెలిపినారు.

# వైభవంగా విగ్నేశ్వర నవరాత్రులు....



**పెనుగంచిప్రోలు - సెప్టెంబర్ 21( వార్త ప్రభ )** శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి దేవస్థానం నందు విగ్నేశ్వర నవరాత్రులు పందిరిలో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది.. ఈ సందర్భంగా సత్యనారాయణ స్వామి వారి వ్రత కార్యక్రమం నిర్వహించారు, అనంతరం దాతల సహాయ సహకారములతో మహా అన్నదాన కార్యక్రమం చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కొమరగిరి రఘురామారావుమాజీ జెడ్ పిటి సి లు గజ్జి కృష్ణమూర్తి యాదయ్ కాకాని శ్రీనివాసరావు , రేగండ్ల రవికుమార్ ఆలయ అభివృద్ధి సభ్యులు విజిఎస్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు...

# మైలవరం పట్టణంలో కోతులు బెడద

- గ్రామంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న కోతులు,కుక్కలు
- కోతులు,కుక్కల దాడిలో గాయపడి ఆస్పత్రి పాలవుతున్న గ్రామ ప్రజలు
- పట్టించుకోని పంచాయితీ అధికారులు
- కోతులు,కుక్కల నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటున్న గ్రామస్తులు




**మైలవరం,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గ కేంద్రమైన మైలవరం పట్టణంలో ప్రజలకు కోతులు,కుక్కల బెడదఎక్కువయ్యింది. పట్టణంలో ఏ వీధిలో చూసినా కోతులు, కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.పురవీధులలో వచ్చే పోయే వారిని భయపెడుతూ,దాడి చేసి మరీ గాయ పరుస్తున్నాయి.వీటి బారినపడి తీవ్ర రక్త గాయాలతో బాధితులు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు.గ్రామంలో కోతులు,కుక్కల సమస్యపై ఎన్నిసార్లు అధికారులకు,పాలకులకు మొరపెటుకున్నా ఫలితం ఉండటం లేదని గ్రామ స్తులు ఆరోపిస్తున్నారు.పట్టణంలో కోతుల సంతతి రోజురోజుకు పెరిగిపోతుందని,ఏ వీధిలో చూసినా పదుల సంఖ్యలో కోతులు, కుక్కలు దర్శనమిస్తున్నాయని పట్టణ ప్రజలు వాపోతున్నారు.వీటికి దడిసి ఇంటి తలుపులు తెరిచి ఉంచాలంటేనే భయమేస్తోందని,ఇంటిలో మనుషులు ఉన్నప్పటికీ రెప్పపాటులో ఇంటి లోపలికి చొరబడి విలువైన వస్తువులను, నిత్యవసర సరుకులను పాడుచేస్తున్నాయని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కలు, కోతుల బారినపడి గాయాలతో చాలా మంది రేబిస్ ఇంజక్షన్లు చేయించుకోవడానికి ఆసుపత్రికి వస్తున్నారని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది చెప్పడం విశేషం.కోతులు మనుషులపై దాడి చేసి ఎక్కడపడితే అక్కడ శరీరాన్ని గాయ పరుస్తూ కండ ఊడే వరకు వదలడం లేదని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. అరుబయట ఆడుకుంటున్న చిన్న పిల్లలపై **సైతం కోతులు దాడి చేస్తున్నాయి.సమస్య..** తీవ్రమవుతున్నప్పటికీ గ్రామ పంచాయితీ అధికారులకు చీమ కుట్టినట్లయినా లేదని గ్రామ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.మరోవైపు మూగ జీవాల సంరక్షణ చట్టం కారణంగా వాటి జోలికి వెళ్లడం లేదంటు పంచాయితీ అధికారులు ఏవేవో కారణాలు చెబుతూ తప్పించుకునే ధోరణి అవలంబిస్తున్నారని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. దీంతో ఎక్కడ చూసినా కోతులు, కుక్కలు గుంపులు,గుంపులుగా కనిపిస్తున్నాయి.కనీసం వాటికి పిల్లలు పుట్టకుండా శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంగాని, రేబిస్ వ్యాధి రాకుండా టీకాలు వేయించడం లాంటి చర్యలు చేపట్టడం లేదు.ఇప్పటికైనా సంబంధిత శాఖ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో ఉన్న కోతులు, కుక్కల సమస్యను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**కోతులు,కుక్కలతో జనాలు పడుతున్న ఇబ్బందులు అన్నీ... ఇన్నీ కావు...! గుంపులు గుంపులుగా సంచరిస్తూ ఏమాత్రం ఆదమరిచి ఉన్నా ఇళ్లలోకి చొరబడుతున్నాయి. కుక్కలు పాదచారుల వెంటపడి కరుస్తున్నాయి. కోతులైతే మనుషలను భయబ్రాంతులకు గురిచేస్తున్నా యి.కుక్కలు, కోతులు చిన్న పిల్లలను సైతం వదలడంలేదు. వీటి బారిన పడి ఆసుపత్రికి వస్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఇంటి వద్ద ఆడుకుంటున్న పిల్లలపై కోతులు దాడి చేసి గాయపరుస్తున్నాయి.కోతులు బెడద భరించలేకున్నామని, వీటి నిర్మూలనకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.**


మైలవరం పట్టణంలో...



## న్యాయవాదుల రక్షణ చట్టం తక్షణమే అమలు చేయాలి



**విజయవాడ లీగల్,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేసి వెంటనే అమలు చేయాలని బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణుభట్ల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. బెజవాడ భారత్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం ఉదయం సివిల్ కోర్టు నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం జిల్లా కలెక్టర్ ను కలిసి న్యాయవాద రక్షణ చట్టం ఏర్పాటు చేసి వెంటనే అమలు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయవాదులకు రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రక్షా చట్టం ఏర్పాటు చేయడం ద్వారా న్యాయవాదులు కొంత భరోసా ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు బి బి ఏ ప్రధాన కార్యదర్శి వలిబోయిన కిరణ్ కుమార్ ఉపాధ్యక్షులు బండారుపల్లి లెనిన్ సీనియర్ న్యాయవాదులు నరహరిశెట్టి నరసింహారావు, శ్రీనివాసరావు, జీవీ మూర్తి, బొమ్మసాన్ రవి కె ఇందిరా, తదితరులు పాల్గొన్నారు

## సేవా సంకల్ప అభియాన్-2026

- 25 కోట్ల భారతీయ చిన్నారుల కలలు
- చిత్రలేఖనం మరియు వక్తృత్వం పోటీలు



**కిర్లంపూడి,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** సెప్టెంబర్ 22, సెప్టెంబర్ 23 తేదీలలో జరుగు కార్యక్రమాల గురించి కిర్లంపూడి మండలంలో కిర్లంపూడి ఎంఈఓ జోసెఫ్ ని, కిర్లంపూడి మండలం బిజెపి అధ్యక్షులు శరకణం రాజబాబు కలిసి గో కాపీ లు ఇవ్వటం జరిగింది. 22,23 వ తేదీల్లో జరిగే కార్యక్రమం గురించి వివరించడం జరిగింది. ఎం ఈ ఓ మండలంలో ఉన్న అన్ని పాఠశాలల కు ఆదేశాలు పంపుతానని చెప్పడం జరిగింది .అలాగే కిర్లంపూడి మండలం కమిటీ సభ్యులతో కొన్ని స్కూల్ కి వెళ్లి చెప్పడం జరిగింది.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ కి ఎంపికైన ఈషా కళాశాల విద్యార్థి

- కృష్ణా & ఎన్టీఆర్ జిల్లా అథ్లెటిక్స్ లో రెండు విభాగాల్లో ద్వితీయ స్థానం



**విజయవాడ,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** విజయవాడ లోని ఈషా కాలేజ్ ఆఫ్ కామర్స్ కళాశాలలో ఏసిసిఏ(ఇంటర్నేషనల్ సిఏ) విద్యను అభ్యసిస్తున్న కోటా షాలోమ్ కి కృష్ణా & ఎన్టీఆర్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏజిఎస్జి సిద్దార్థ కళాశాల గ్రౌండ్స్ ఉయ్యూరు లో నిర్వహించిన కాంపిటీషన్స్ లో షాట్ పుట్ మరియు డిస్కస్ త్రో రెండు విభాగాల్లో సెకండ్ ప్లేస్ ను సాధించారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే అథ్లెటిక్స్ కు కోటా షాలోమ్ సెలెక్ట్ అయ్యారు.ఈ సందర్భంగా ఈషా కళాశాల చైర్మన్ సుంకసాని గోపీచంద్, మేనేజింగ్ డైరెక్టర్ అనన్య,అకడమిక్ డీన్ క్రాంతి కుమార్,నంద కిషోర్,ప్రిన్సిపాల్ చంటిబాబు,ఏజిఎం కాల్విన్ మెజిస్టీ మరియు సిబ్బంది షాలోమ్ ని అభినందించారు.ఈ సందర్భంగా చైర్మన్ గోపీచంద్ మాట్లాడుతూ తమ కళాశాలలో చదువుకునే విద్యార్థులకు విద్య పాటు క్రీడలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.క్రీడలు శారీరక దృఢత్వం,మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని కలిగిస్తాయని ప్రతి ఒక్కరూ కూడా విద్యతో పాటు,క్రీడలపై కూడా దృష్టి సారించి ఒత్తిడిని తగ్గించుకోవచ్చని అన్నారు.మా కళాశాల చదివే విద్యార్థులు ఎవరైతే కాంపిటీషన్స్ పాల్గొంటారో వారందరినీ తాము ప్రోత్సహిస్తామని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించడం ద్వారా సంపూర్ణ ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చునని అన్నారు. కోటా షాలోమ్ భవిష్యత్తులో జాతీయ , అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## శిశు గృహ సంరక్షణలో ఉన్న ఇద్దరు బాలికలకు చట్టబద్ధంగా దత్తత

- దత్తత ప్రక్రియలో అన్ని నిబంధనలు, ధ్రువపత్రాల పరిశీలన
- బాలికల ఆరోగ్యం, భద్రత, విద్యకు ప్రాధాన్యత
- జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ



**విజయవాడ,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ప్రత్యేక దత్తత సంస్థ శిశు గృహంలో సంరక్షణలో ఉన్న ఇద్దరు బాలికలకు సోమవారం జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ ఆధ్వర్యంలో చట్టబద్ధమైన దత్తత ప్రక్రియను చేపట్టారు. దత్తత ప్రక్రియలో భాగంగా బాలికల గుర్తింపు వివరాలు, దత్తత తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, సంబంధిత ధ్రువపత్రాలు, పత్రికా ప్రకటన, ఇతర అవసరమైన రికార్డులను పరిశీలించారు. దత్తత ప్రక్రియలో అన్ని చట్టపరమైన నిబంధనలు, నిర్దేశిత విధానాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. బాలికల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, నిర్వహించిన వైద్య పరీక్షలు, ఆరోగ్య రికార్డులపై కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాలికల ఆరోగ్యానికి సంబంధించిన పూర్తి వివరాలను దత్తత తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. బాలికలను ప్రేమతో, బాధ్యతతో పెంచాలి. దత్తత తల్లిదండ్రులతో మాట్లాడిన కలెక్టర్ డా.జి.లక్ష్మీశ, బాలికలను ప్రేమతో, బాధ్యతతో పెంచాలని సూచించారు. వారి ఆరోగ్యం, పోషణ, విద్య, భద్రత, సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. బాలికలకు సురక్షితమైన, ప్రేమపూర్వకమైన కుటుంబ వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. దత్తత అనంతరం బాలికలకు కన్నబిడ్డతో సమానంగా హక్కులు, బాధ్యతలు, కుటుంబ సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. చట్టబద్ధమైన దత్తత ప్రక్రియ ద్వారా పిల్లలకు సురక్షితమైన కుటుంబ వాతావరణం, మెరుగైన భవిష్యత్తు కల్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ షేక్ రుక్సానా సుల్తానా బేగం, జిల్లా బాలల పరిరక్షణ అధికారి యమ్. రాజేశ్వరరావు, లీగల్ ఆఫీసర్ కిరణ్ కుమార్, శిశు గృహ మేనేజర్ దీపిక, సోషల్ వర్కర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

## గురజాడ ఆశయాలే విద్యార్థులకు స్ఫూర్తి..



**హనుమాన్ జంక్షన్,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** మద్దాయికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంఘసంస్కర్త, మహాకవి గురజాడ వెంకట అప్పారావు జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు దారపురెడ్డి భాస్కర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు మాట్లాడుతూ.. స్త్రీ విద్య కోసం, తెలుగు భాష అభివృద్ధి కోసం, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా గురజాడ వెంకట అప్పారావు చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. అభ్యుదయ భావాలను తన రచనల ద్వారా సమాజంలోకి తీసుకెళ్లిన తొలి తరం ప్రముఖ కవుల్లో గురజాడ ఒకరని పేర్కొన్నారు. నేటి తరం విద్యార్థులు గురజాడ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. గురజాడ రచించిన కన్యాశుల్కం నాటకంతో పాటు ఇతర సామాజిక రచనలు సమాజంపై విశేష ప్రభావం చూపాయని తెలిపారు. దేశభక్తి భావాలను పెంపొందించే ఆయన ప్రసిద్ధ గేయం 'దేశమును ప్రేమించుమన్నా'ను విద్యార్థులతో ఆలపించారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు శివ నాగరాజు, హిందీ ఉపాధ్యాయురాలు జె.పద్మ, శారీరక విద్యా ఉపాధ్యాయురాలు కె.నవ్య తదితరులు పాల్గొన్నారు.

## మృతుని ఆచూకీ గుర్తించి బంధువులకు అప్పగించిన పోలీసులు




**మైలవరం,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** మైలవరం పట్టణంలో అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీని మైలవరం పోలీసులు గుర్తించారు.అతని బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు.మృతుడు తాతినేని వెంకట రామారావు(60) అని అతడు ఎన్టీఆర్ జిల్లా, నందిగామ మండలం, ఐతవరం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించామని మైలవరం సబ్ ఇన్స్పెక్టర్ సుధాకర్ వెల్లడించారు.సదరు వ్యక్తి సుమారు మూడు నెలలు నుంచి మైలవరం పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో, ముఖ్యం గా రైతుబజార్ పరిసరాల్లో ఉంటూ యాచిస్తూ జీవనం సాగిస్తున్నట్లు విచారణలో తెలిసిందన్నా రు.ఈ క్రమంలో 21-09-2026 తేదీ ఉదయం సుమారు 10:00 గంటల సమయంలో, మైలవరం మెయిన్ రోడ్డులో సొసైటీ బ్యాంకు ఎదురుగా ఉన్న సిటీ కేబుల్ కార్యాలయం వద్ద రోడ్డు పక్కన సదరు వ్యక్తి అనారోగ్యంతో మృతి చెంది ఉన్నట్లు సమాచారం అందిందని తెలిపా రు.సమాచారం అందుకున్న వెంటనే మైలవరం పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎం.డి.యూనస్ మరియు కానిస్టేబుల్ పి.సి.జగన్ ఘటనా స్థలానికి చేరుకొని పరిసర ప్రాంతాల్లో విచారణ చేపట్టారని పేర్కొన్నారు. మృతుడు గతంలో పరిచయం ఉన్న వ్యక్తులతో మాట్లాడి, అతని వివరాలను సేకరించి, తద్వారా అతని స్వగ్రామం మరియు బంధువుల ఆచూకీని గుర్తించడం జరిగిందని ఎస్ఐ తెలియజేశారు.వెంటనే మృతుని బంధువులకు సమాచారం అందించి వారిని మైలవరానికి పిలిపించామని,బంధువులు వచ్చి మృతుడు తాతినేని వెంకట రామారావుగా గుర్తించిన అనంతరం, అవసరమైన ప్రక్రియ పూర్తి చేసి మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించడం జరిగిందన్నారు.గుర్తుతెలియని స్థితిలో మృతి చెందిన వ్యక్తి ఆచూకీని చాకచక్యంగా గుర్తించి, అతని బంధువులను సంప్రదించి మృతదేహాన్ని వారికి అప్పగించడంలో కృషి చేసిన హెడ్ కానిస్టేబుల్ ఎం.డి.యూనస్, పి.సి. జగన్ లను మైలవరం ఏసీపీ,మైలవరం సీఐ ప్రత్యేకంగా అభినందించారు.

## సామాజిక స్పృహ తో అన్ని వర్గాల అభిమానంతో మరింతగా ఎదగాలి..

- భారత చైతన్య యోజన పార్టీ నాయకులకు, జిల్లా యాదవ నాయకుల అభినందన



**మార్కాపురం, సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** భారత చైతన్య యోజన పార్టీ బీసీవై మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గ కో కన్వీనర్ గా నియమితులైన కనపర్తి బాల గోవిందు యాదవ్ మరియు ఎర్రగొండపాలెం నియోజకవర్గ బీసీవై పార్టీ కో కన్వీనర్ గా నియమితులైన గోనుగుంట్ల కళ్యాణ్ రాజు యాదవ్ లను మార్కాపురం జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో ఘనంగా సత్కరించడం అయినది. సామాజిక స్పృహ కలిగి అన్ని వర్గాల యొక్క అభిమానాన్ని చురుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదగాలని రాజకీయంగా ఎంతో ఎత్తుకు ఎదిగి బీసీ వర్గాల తో పాటు మిగతా వర్గాలకు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తూ సాగిపోవాలని వక్తలు ఈ సమావేశంలో ప్రసంగించారు.. ఈ సన్మాన కార్యక్రమంలో పి ఎల్ పి యాదవ్ కాటంరాజు గంగాభవాని దేవస్థాన కమిటీ ప్రధాన కార్యదర్శి బుర్రి జన్న వెంకటేశ్వర్లు యాదవ్ ప్రముఖ న్యాయవాది విజయ వర్ధన్ యాదవ్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పిన్నిక చక్రపాణి యాదవ్ యాదవ సంఘం మార్కాపురం జిల్లా అధ్యక్షులు బత్తుల పెద్ద అల్లూరయ్య యాదవ్ శ్రీ వెలుగొండ వెంకటేశ్వర స్వామి యాదవ్ అన్నదాన సత్రం ప్రధాన కార్యదర్శి బొరిగొల్ల గాలయ్య యాదవ్, మార్కాపురం జిల్లా యాదవ సంఘం కార్యదర్శి గుమ్మా రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

## సంగముడి ఎస్సీ కాలనీలో విశ్వ హిందూ పరిషత్ సామాజిక సామరస్యత కార్యక్రమం



**పెడన,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ) :** హిందూ సమాజంలోని అన్ని వర్గాల మధ్య ఆత్మీయత ఏకత్వం పరస్పర సహకారం పెంపొందించడమే లక్ష్యంగా విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సమరసతా కార్యక్రమాలు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూరగడ్డ శ్రీనాథ్ సూచనల మేరకు ఎస్సీ కాలనీల్లోని దేవాలయాలు, ధార్మిక కార్యక్రమాలు మరియు వినాయక మండపాలను సందర్శిస్తూ స్థానిక హిందూ బంధువులతో ఆత్మీయంగా సమావేశమవుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పెడన నియోజకవర్గం జిల్లా కృత్తివెన్ను మండలం సంగముడి చివరి ఏటిగట్టు వద్ద ఉన్న ఎస్సీ కాలనీలోని వినాయక మండపాలను విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు సందర్శించారు. మండప నిర్వాహకులను స్థానిక హిందూ బంధువులను కలిసి వినాయక ఉత్సవాల నిర్వహణ గురించి తెలుసుకోవడంతో పాటు విశ్వ హిందూ పరిషత్ చేపడుతున్న వివిధ ధార్మిక, సామాజిక కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ జిల్లా ప్రచార ప్రసార సహ ప్రముఖ్ బసవని నీలాజలం ఎస్సీ కాలనీకి చెందిన యువత బాలలతో ప్రత్యేకంగా మాట్లాడారు. హిందూ సమాజంలో ప్రతి వ్యక్తికి సమానమైన ఆత్మీయ స్థానం ఉందని, పరస్పర గౌరవం సోదరభావం సహకారం ద్వారా సమాజాన్ని మరింత బలోపేతం చేయవచ్చని వివరించారు. వినాయక ఉత్సవాలకు ప్రత్యేకమైన సామాజిక ప్రాధాన్యత ఉందని వినాయక మండపాలు స్థానిక ప్రజలను ఒకచోట చేర్చి భక్తి, సోదరభావం, సేవా కార్యక్రమాలకు వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. యువత మరియు బాలలు ఇటువంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా క్రమశిక్షణ సేవాభావం నాయకత్వ లక్షణాలు సమాజం పట్ల బాధ్యతను పెంపొందించుకోవచ్చని సూచించారు. వినాయక నిమజ్జన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో క్రమశిక్షణతో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహించాలని కూడా సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం శబ్ద కాలుష్యాన్ని నివారించడం భక్తి భావాన్ని ప్రతిబింబించే కార్యక్రమాలను నిర్వహించడం నిమజ్జన సమయంలో క్రమశిక్షణ పాటించడం వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీకి చెందిన యువత బాలలు ఆసక్తిగా పాల్గొని విశ్వ హిందూ పరిషత్ కార్యకలాపాలు సామాజిక సమరసతా కార్యక్రమాల ఉద్దేశ్యం హిందూ సమాజంలో సమిష్టి కార్యక్రమాల అవసరం గురించి తెలుసుకున్నారు. స్థానిక యువతను భవిష్యత్తులో మరిన్ని ధార్మిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని కార్యక్రమ నిర్వాహకులు ఆరవ నాగేశ్వరావు సూచించారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188

## యాప్రాల్ కౌకూరు బీజేపీ అధ్యక్షుడిగా ఎం నవీన్ గౌడ్(లడ్డుగౌడ్)



జవహర్ నగర్, సెప్టెంబర్ 21(వార్తా ప్రభ):యాప్రాల్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా ఎం నవీన్ గౌడ్ (లడ్డుగౌడ్) నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచంద్రరావు సూచనల మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎం నవీన్ గౌడ్(లడ్డుగౌడ్) తెలిపారు. బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో డివిజన్ ల్లో బీజేపీ గెలుపులో కృషి చేస్తానని తెలిపారు. ఈ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను అని అన్నారు.

## భారత్ రక్తదాన్ ఉత్తమ సేవ పురస్కారం 2026 అవార్డు

“అందుకున్న పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్



భువనగిరి: సెప్టెంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)తెలంగాణ రాష్ట్రం యాదాద్రి – భువనగిరి జిల్లా, ఆత్మకూరు పట్టణంలో పిఎస్ ఫంక్షన్ హాల్ నందు భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం దక్షిణ భారతదేశంలోని ఆంధ్ర – తెలంగాణ రాష్ట్రాలకు చెందిన రక్తదాతలకు మరియు సామాజిక సేవకులకు ఉత్తమ సేవా పురస్కారల ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా 336 సార్లు రక్తదానం చేసి ప్రపంచ స్థాయిలో పేరుగాంచిన సంపత్ కుమార్, సంస్థ వ్యవస్థాపకులు కురుమేటి నవీన్, సర్వ్ నీడి సోషల్ ఆర్గనైజేషన్ గౌతమ్, తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అతిథుల చేతుల మీదుగా వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు పాశం శ్రీ కృష్ణదేవరాయ యాదవ్ ఉత్తమ సేవ పురస్కారం 2026 అవార్డును అందుకున్నారు. వర్స టైల్స్ సర్వీసెస్ ట్రస్ట్ సంస్థ ద్వారా పేద విద్యార్థులకు నోట్ బుక్స్, ఎగ్జామినేషన్ కిడ్స్, స్కాలర్షిప్ ప్రోగ్రామ్స్, మోటివేషన్ క్లాసులు వంటి కార్యక్రమాలు, అనాథ మరియు వృద్ధాశ్రమాలలో అన్నదాన కార్యక్రమాలు, నిరుపేదలు నివసించే ప్రాంతాలలో వారికి బియ్యం, దుస్తులు, అన్నదాన కార్యక్రమాల తో పాటుగా అక్కడ పిల్లలకు చదువు పట్ల అవగాహన కనిపించడం వారిని స్కూలు పంపించడం వంటి కార్యక్రమాలు చేస్తూ మారుమూల ప్రాంతాలలో నివసిస్తున్న వారికి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తూ ఉచిత మెడికల్ క్యాంపులు రక్త పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు గాను అవార్డును అందించడం జరిగింది. ఈ అవార్డును అందించిన కే నవీన్ మరియు వారి కమిటీ సభ్యులకు ట్రస్ట్ తరపున చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. సేవ పురస్కార అవార్డు అందుకున్న పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్ కు పలువురు అభినందనలు తెలిపారు.

## బీజేపీ బాచుపల్లి డివిజన్ అధ్యక్షురాలిగా విజయలక్ష్మి సుబ్బారావు నియామకం

**ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా అధ్యక్షుడు డి. గిరివర్ధన్ రెడ్డి**

**నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మాజీ కార్పొరేటర్**






బాచుపల్లి, సెప్టెంబర్ 21, (వార్తాప్రభ) : భారతీయ జనతా పార్టీ 274 బాచుపల్లి డివిజన్ అధ్యక్షురాలిగా మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు ఆదేశాల మేరకు మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా అధ్యక్షుడు డి. గిరివర్ధన్ రెడ్డి ఈ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. బాచుపల్లి డివిజన్ అధ్యక్షురాలిగా ఎంపికైన విజయలక్ష్మి సుబ్బారావుకు పార్టీ జిల్లా, నిజాంపేట్ సర్కిల్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం విజయలక్ష్మి సుబ్బారావు మాట్లాడారు. తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతలను అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, జిల్లా అధ్యక్షుడు డి. గిరివర్ధన్ రెడ్డిలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పదవిని బాధ్యతగా స్వీకరించి, నాయకత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు. బాచుపల్లి పరిధిలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు, ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని పేర్కొన్నారు. తనకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు.

## వినాయక నవ రాత్రి పూజలో ఎస్ఐ అర్జున్.



పెనుగంచిప్రోలు – సెప్టెంబర్ 21( వార్త ప్రభ ) పెనుగంచిప్రోలు గ్రామంలోని పడమట బజార్ లో వేంచేసి ఉన్న శ్రీ అంబికేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రులలో ఆదివారం స్థానిక ఎస్ ఐ. ఎం ఎస్ కే అర్జున్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహణ కమిటీ సభ్యులు ఎస్సై అర్జున్ దృశ్యాలు వాళ్ళతో సత్కరించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు తునికి పాటి రామాచారి, హిరణ్, వట్టెం శ్రీనివాసరావు, గుగులోతు ప్రవీణ్, బ్రహ్మం,కర్ల రమేష్, రాజేష్, చింత గోపాలరావు తదితరులు పాల్గొన్నారు..

# కీసరలో ఘనంగా కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ

- నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్
- మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్, కీసర డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణతో పాటు నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

కీసర, సెప్టెంబర్ 21(వార్తా ప్రభ)కీసర డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామిడి స్వప్న విజయ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి, నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు ప్రజలకు అందుబాటులో ఉండే వేదికలుగా పనిచేయాలని, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని వజ్రేష్ యాదవ్ సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెలిపారు. కీసర డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని వజ్రేష్ యాదవ్ పిలుపునిచ్చారు. ప్రజలకు అండగా నిలుస్తూ పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబెర్ జైపాల్ రెడ్డి, జిల్లా మార్కెట్ కమిటీ ఛైర్మెన్ నర్సింహా యాదవ్,డీసీసీ ఉపాధ్యక్షులు






వేముల మహేష్ గౌడ్, మాజీ కీసర మండల్ అధ్యక్షులు కోళ్ల కృష్ణ యాదవ్ డీసీసీ సెక్రెటరీ నర్సింగ్ రావు,మేడ్చల్ నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షులు ఖాజామైనుద్దీన్, కీసర డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,మాజీ ప్రజా ప్రతినిధులు,మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ రెవెన్యూలో ఆర్ఐ కలీం తీరుపై విమర్శలు

- ప్రభుత్వ భూముల పరిరక్షణలో అనుమానాలు.. మీడియా ప్రతినిధిపై దురుసు ప్రవర్తన?
- సర్వే నంబర్లు 342, 329, 329/1లపై సమగ్ర విచారణకు స్థానికుల డిమాండ్













కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 21, (వార్తాప్రభ) : ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు బాధ్యత వహించాల్సిన రెవెన్యూ విభాగంలో కొందరు అధికారుల వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కుత్బుల్లాపూర్ పరిధిలోని కైసర్ నగర్, దేవేందర్ నగర్, సాబీర్ నగర్, మంజూరు నగర్ ప్రాంతాల్లో గల సర్వే నంబర్లు 342, 329, 329/1 భూముల్లో అక్రమ ఆక్రమణలు, నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా క్రయవిక్రయాలు జరుగుతున్నాయన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**వివరాలు అడిగిన విలేకరిపై ఆగ్రహం** ఇదిలా ఉండగా, సదరు ప్రభుత్వ భూములకు సంబంధించిన వివరాలు సేకరించేందుకు యత్నించిన ఒక పత్రికా విలేకరితో కుత్బుల్లాపూర్ రెవెన్యూ కార్యాలయ ఆర్ఐ కలీం అమర్యాదగా, దురుసుగా ప్రవర్తించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ స్థలాల రక్షణపై సమాధానం ఇవ్వాల్సిన అధికారి, ప్రశ్నించిన మీడియా ప్రతినిధిపైనే ఆగ్రహం వ్యక్తం చేయడం విస్మయానికి గురిచేస్తోందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

**ప్రభుత్వ భూమి లెక్కలపై స్పష్టత కరవు** కైసర్ నగర్, దేవేందర్ నగర్, సాబీర్ నగర్, మంజూరు నగర్ ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల పరిరక్షణపై గత కొంతకాలంగా వరుస ఫిర్యాదులు అందుతున్నాయి. సర్వే నంబర్లు 342, 329, 329/1 పరిధిలో ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఆ భూమి ఏ కేటగిరీలో ఉంది? మొత్తం విస్తీర్ణం ఎంత? ప్రస్తుతం ఎంత భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉంది? ఆక్రమణలు జరిగాయా? నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారా? అనే అంశా లపై అధికారుల నుంచి ఎలాంటి స్పష్టత లభించడం లేదు. క్షేత్రస్థాయిలో అక్రమ నిర్మాణాలకు కొందరు రెవెన్యూ సిబ్బంది పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఆర్ఐ కలీం వ్యవహారశైలిపై తీవ్రమైన అసంతృప్తి వ్యక్తమవుతోంది.

**ఉన్నతాధికారుల ఆదేశాలనూ బేఖాతరు చేస్తున్నారా?** ఆర్ఐ కలీం తన అధికార పరిధిని దాటి వ్యవహరిస్తున్నారని, చివరకు డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్ స్థాయి అధికారుల సూచనలను సైతం లెక్కచేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవమెంత అన్నది క్షేత్రస్థాయి పరిశీలన, ఉన్నతాధికారుల విచారణ ద్వారా తేలాల్సి ఉంది.

**సమగ్ర సర్వే జరిపి భూములను కాపాడాలి** ప్రభుత్వ భూములు ప్రజల ఉమ్మడి ఆస్తి అని, వాటిని కాపాడాల్సిన కనీస ధర్మం రెవెన్యూ యంత్రాంగానికి ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. వివాదాస్పద సర్వే నంబర్లలో భూమి హద్దులను గుర్తించేందుకు జిల్లా స్థాయి ఉన్నతాధికారులు ప్రత్యేక సర్వే బృందాన్ని నియమించాలని, ఆక్రమణలు నిజమని తేలితే వాటిని తక్షణమే తొలగించి, బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆధ్యాత్మిక, సేవా తత్పర కార్యక్రమాలతో సమాజంలో సద్భావన పెరుగుతుంది.

**-గణేష్ నవరాత్రి మహోత్సవ పూజ కార్యక్రమంలో నాయకుల అభిలాష**



శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 21 (వార్తాప్రభ): మియాపూర్ డివిజన్ లోని హనుమాన్ టెంపుల్ లో నవరాత్రి మహోత్సవాల సందర్భంగా మియాపూర్ యూత్ అసోసియేషన్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సోమవారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎల్లంకి రవి గౌడ్,శ్రీనివాస్ గౌడ్,వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నేత,మాజీ కౌన్సిలర్ బందారు రామచందర్ ముదిరాజ్,రాచమల్ల ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై అన్నదానాన్ని ప్రారంభించారు. ముందుగా వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం నిర్వాహకులు ముఖ్య అతిథులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా అన్నదానం అత్యంత పవిత్రమైనదని, వందలాది మంది భక్తులకు అన్నప్రసాదం అందించడం అభినందనీయమన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలతో సమాజంలో సద్భావన పెరుగుతుందని పేర్కొన్నారు.



గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ యూత్ కమిటీ సభ్యులు, స్థానిక యువత,వివిధ పార్టీల నాయకులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వార్తా ప్రభ

# హైదరాబాద్

## 22న హోమ చూర్ణం మరియు నెయ్యి పంపిణీ

**25న ప్రకాశం స్టేడియంలో గణేష్ నిమర్జన పూజ**

**గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు యెర్రా కామేష్**




భద్రాద్రి కొత్తగూడెం సెప్టెంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)కొత్తగూడెం ఈనెల 22వ తేదీన గణపతి మండపాలు ఏర్పాటు చేసిన వారికి ఉచితంగా హోమ చూర్ణం మరియు ఆవు నెయ్యి పంపిణీ చేయడం జరుగుతుందని గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు న్యాయవాది యెర్రా కామేష్ తెలిపారు. సోమవారం వివేకానంద హైస్కూల్ నందు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసిన నిర్వాహకులు 22వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు కల్లా వివేకానంద హైస్కూల్ కు చేరుకుని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేసే హోమ చూర్ణం మరియు ఆవు నెయ్యి పంపిణీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా ఈ నెల 25వ తేదీన నిమర్జన కార్యక్రమం స్థానిక ప్రకాశం స్టేడియంలో మధ్యాహ్నం 3 గంటలకు పూజాకార్యక్రమం అనంతరం ప్రకాశం స్టేడియం నుండి శోభాయాత్ర ప్రారంభమై సూపర్ బజార్ సెంటర్ లో ఏర్పాటు చేసిన స్టేజ్ వద్ద గణనాధులకు స్వాగత ఏర్పాట్లు చేయడం జరిగిందని,గణేష్ ఉత్సవాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులు కొత్తగూడెంలో జరిగే శోభాయాత్రలో పాల్గొనుటకు మధ్యాహ్నం 3 గంటల కల్లా స్థానిక ప్రకాశం స్టేడియం గ్రౌండ్ కు చేరుకొని నిర్వాహకులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు పలివేల సాంబశివరావు,ఆంధ్రప్రభ లక్ష్మణ్,ప్రధాన కార్యదర్శి దారా రమేష్,మెరుగు చింతేశ్వర్, అవుటుపల్లి రాంబాబు,కుడిక్యాల సమ్మయ్య,ఆకుల యాకయ్య తదితరులు పాల్గొన్నారు

## కాల్వల తూముల వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనం చేయొద్దు

**ఇరిగేషన్ శాఖ అధికారి బానోత్ నిరోష**



బజాజ్ కొత్తగూడెం జిల్లా వార్త ప్రభ (ప్రతినిధి)సుజాతనగర్, సెప్టెంబర్ 21 వినాయక చవితి నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో సుజాతనగర్ మండల పరిధిలోని ప్రజలకు ఇరిగేషన్ శాఖ అధికారి బానోత్ నిరోషా ఒక ప్రకటనలో సోమవారం సింగభూపాలెం ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల తూముల వద్ద వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. విగ్రహాల నిమజ్జనం కోసం చెరువులో అధికారులు నిర్దేశించిన ప్రదేశాలను మాత్రమే వినియోగించుకోవచ్చని తెలిపారు. కాల్వల తూముల సమీపంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ప్రజల భద్రతతో పాటు సాగునీటి వ్యవస్థకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఈ సూచనలు పాటించాలని కోరారు. మండల ప్రజలందరూ ఇరిగేషన్ శాఖ సూచనలను గమనించి, నిర్దేశిత ప్రదేశాల్లోనే వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆమె తెలిపారు

## వినాయక నిమజ్జనంలో డీజేలకు అనుమతి లేవు - ఎస్ ఐ కళ్యాణి

**డీజే లు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు ఎస్ఐ హెచ్చరిక...**



భద్రాద్రి కొత్తగూడెం సెప్టెంబర్ 21 :(వార్తా ప్రభ ప్రతినిధి) వినాయక నిమజ్జన ఊరేగింపులో డీజేలు, అధిక శబ్దాన్ని ఉత్పత్తి చేసే సౌండ్ సిస్టమ్ లను వినియోగించేందుకు అనుమతి లేదని సుజాతనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కళ్యాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేసి వినియోగిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఊరేగింపు సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారుఅనుమతులు లేకుండా డీజేలు, అధిక శబ్ద పరికరాలు ఏర్పాటు చేయడం వలన ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని, నిబంధనలను ఉల్లంఘించడం చేస్తే సంబంధిత నిర్వాహకులపై కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్థానిక వినాయక మండపాల వద్ద నిర్వాహన చేస్తున్న వారికి స్టేషన్లో ప్రత్యేక సూచన తెలిపి, నిర్వాహకులు నిబంధనలు పాటించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా పూర్తి చేసి పోలీస్ నిబంధనలు పాటించి డి జే లు వినియోగించవద్దని సూచించారు. నిబంధన ఉల్లంగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.